అంతరిక్ష పరిశోధనలో సరికొత్త శిఖరాలను ఇస్రోశాస్త్రవేత్తలు అధిరోహించనున్నారు. 2025లో భారత్ ఎన్నెన్నో ప్రయోగాలను చేపట్టనుంది. గత ఏడాది ప్రారంభంలో, చివరలో ఇచ్చిన ఉత్సాహంతో భవిష్యత్ రాకెట్ల తయారీకి ఇస్రోవడివడిగా సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా శ్రీహరికోట నుంచి ఉపగ్రహాలను మోసుకెళ్లే రాకెట్లలో 100వ ప్రయోగం జనవరిలోనే జరపనున్నారు. జిఎస్‌ఎల్‌వి-ఎఫ్15 పేరుతో ఈ రాకెట్ ఇప్పటికే సిద్ధమయింది. వాహనచోదకులకు ఉపయోగపడే నావిగేషన్ వ్యవస్థ కోసం ఎన్ ఇఎస్-02 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారా ప్రయోగిస్తున్నారు. జిఎస్‌ఎల్ వి-ఎఫ్16 పేరుతో మరో రాకెట్‌ను మార్చినెలలో ప్రయోగిస్తారు. దీనిద్వారా నిసార్ ఉపగ్రహ ప్రయోగం ఉంటుంది. మరో రెండు జిఎస్‌ఎల్‌వి ప్రయోగాలు కూడా 2025లోనే జరగనున్నాయి. అందులో ఒకదానిలో జిఐశాట్ 02, ఇంకో దానిలో ఐడిఆర్‌ఎస్‌ఎస్ 01 ఉపగ్రహాల ప్రయోగం ఉంటుంది. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లోను కనీసం మూడు రాకెట్లను శ్రీహరికోట నుంచి ప్రయో గిస్తున్నారు. టిడిఎస్01 ఉపగ్రహాన్ని పిఎస్‌ఎల్‌వి-ఎన్1 రాకెట్ ద్వారా ప్రయోగిస్తారు. మరో పిఎస్‌ఎల్‌వి ద్వారా సముద్ర అన్వేషణకు ఓషన్‌శాట్ 3ని ప్రయోగిస్తారు. దీనికితోడు అన్వేషణఅనే ఉపగ్రహాన్ని రూపొందించి పిఎస్‌ఎల్‌వి రాకెట్ ద్వారానే ప్రయోగిస్తారు. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో ఎస్‌ఎస్‌ఎల్‌వి ఎస్1 బుల్లిరాకెట్ ద్వారా పరీక్షిత్ అనే ఉపగ్రహాన్ని 2025లోనే ప్రయో గించే అవకాశం ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే భారత్ భారీ బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3 ఎం5 ద్వారాబ్లూబర్డ్ 6 ఉపగ్రహ ప్రయోగం ఉంటుంది. ఇస్రో చేపడుతున్న ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ ప్రాజెక్టులో వ్యోమగాములను కాకుండా రోబోలను పంపించే మానవరహిత ప్రయోగం 2025 మార్చిలోనే జరుగుతుందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించారు.


# అంతరిక్షంలో ఉపగ్రహాల అనుసంధానం

**పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి**

అంతరిక్ష పరిశోధనలో భారత శాస్త్రవేత్తలు అత్యంత ప్రతిష్టాత్మక ఘన విజయం సాధించారు. ఇప్పటికే గ్రహాల అంచులు తాకిన మన ఉపగ్రహాలు అంతరిక్షంలో సరికొత్త విన్యాసాలకు మార్గం చూపిస్తున్నారు. స్పేడెక్స్ పేరుతో డిసెంబర్ 30న ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు ప్రస్తుతం నిర్ణీత కక్ష్యలలో స్థిరంగా క్షేమంగా ఉన్నాయి. వీటిని క్రమేణా దగ్గరకు జరిపి ఒకదానికొకటి అనుసంధానం అయ్యే విధంగా భూకేంద్రాల నుంచి ఇస్రో పరిశోధన చేస్తుంది. ఈ నెల 7 నుంచి ఈ ప్రక్రియ బెంగళూరు సమీపంలోని ఇస్ట్రాక్ కేంద్రం నుంచి మొదలవనుంది. పిఎస్‌ఎల్‌వి-సి60 ద్వారా కొంచెం దూరంగా విడిచిపెట్టిన ఈ ఉపగ్రహాలు క్రమేణా దగ్గర కానున్నాయి. ఆ ప్రక్రియ విజయవంతమైతే భవిష్యత్‌లో చంద్రయాన్ ద్వారా చంద్రుని నుంచి నమూనాలు సేకరించడం సాధ్యపడుతుంది. దీనికితోడు భారత శాస్త్రవేత్తలు అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు కూడా ఈ స్పేడెక్స్ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడనుంది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ అనే స్పేడెక్స్ పరిజ్ఞానం మనకు అందుబాటులోకి రానుంది. డాకింగ్ అంటే రెండు ఉపగ్రహాలు ఒకదానితో ఒకటి కలిసే విధానమే. ఈ విధానాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన అగ్రదేశాల సరసన మన శాస్త్రవేత్తలు భారత పతాకాన్ని సగర్వంగా ఎగురవేయనున్నారు. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో 62వ ప్రయోగంగా స్ట్రాపాన్లు లేకుండా కోర్ అలాన్ తరహాలో నిర్మించిన పిఎస్‌ఎల్‌వి-సి60 రాకెట్ గత నెల30న రాత్రి మన తెలుగు నేల శ్రీహరికోట నుంచి సగర్వంగా నింగికి దూసుకెళ్లింది. ముందుగా భూమికి 476 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో 55 డిగ్రీల కోణంతో ఒక్కొక్కటి 220 కిలోల బరువు ఉన్న స్పేడెక్స్ ఉపగ్రహాలను సుమారు 10 కిలోమీటర్ల దూరంలో విడిచిపెట్టింది. అనంతరం పోయంగా పిలిచే నాలుగో దశ మరో 24 సూక్ష్మ ఉపగ్రహాలను భూమికి దగ్గర కక్ష్యలో విడిచిపెట్టింది. ఆ సూక్ష్మ ఉపగ్రహాలలో 10 మన దేశంలోని వివిధ స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటుసంస్థలు రూపొందించినవి. మిగిలిన 14సూక్ష్మ ఉపగ్రహాలను ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించారు. ఈ నెల 7నుంచి ఇస్రో స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ పరిశోధన మొదలుపెట్టనుంది. ఇస్ట్రాక్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలు ఉపగ్రహాలను ఎప్పటికప్పుడు కదిలిస్తూ ఒక చోటికి చేర్చి అనుసంధానం చేయనున్నారు. అవసరమైతే మళ్లీ వాటిని విడదీసి ఇంకొంత దూరంలో ఉంచి మళ్లీ అనుసంధానం చేస్తారు. ఈ విధంగా పరిశోధన పూర్తయితే భవిష్యత్‌లో జరిగే కీలక



ఉపగ్రహాలు అంతరిక్షంలో ఒక్క చోటికి చేరి తమ పరిశోధన ఫలితాలను శాస్త్రవేత్తలకు అందిస్తాయి. ఇది భారత అంతరిక్ష సాంకేతికతకు ఒక కీలక పరీక్షగా చెబుతున్నారు. ప్రస్తుతం విడిచిన స్పేడెక్స్ ఉపగ్రహాలు ఛేజర్, టార్గెట్ మధ్య కలయిక విడిపోవడం అంటే డాకింగ్, అన్‌డాకింగ్ సాంకేతికతను అభివృద్ధి చేయడం ఒక ప్రదర్శన. డాకింగ్ తర్వాత విద్యుత్ శక్తిని ఒక ఉపగ్రహం నుంచి మరొక దానికి సరఫరా చేయడంకూడా ఈ పరీక్షలో కీలకం. ఉపగ్రహాల ఉమ్మడి నియంత్రణను ఉపయోగించి అనుసంధానం తర్వాత ఉపగ్రహాల్లోని పేలోడ్లను పనిచేసేందుకు సిద్ధం చేయడం కూడా ఇందులో ఒక ప్రక్రియ. భవిష్యత్‌లో కాలంచెల్లిన ఉపగ్రహాలను సైతం మళ్లీ పంపించే ఉపగ్రహాల అనుసంధానంతో అందులోకి విద్యుత్ సరఫరా వంటివి చేసి తిరిగి పనిచేసే విధంగా కృషి చేసే అవకాశం లేకపోలేదు. ఈ ప్రయోగం కోసం ఇస్రో అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతికతలు ఎన్నో ఉన్నాయి. ఇందులో ఒకటి డాకింగ్ మెకానిజం. అతితక్కువ వేగంతో అంటే ఒక సెకనుకు కేవలం 10 మిల్లీమీటర్లు దూరం కదులుతూ ఉపగ్రహాలను కలిపే ప్రత్యేక పరికరం అమర్చారు. ఉపగ్రహాల సున్నితమైన కదలికలను నిఘా చేస్తూ కచ్చితమైన ఆదేశాలను అందించే డాకింగ్ సెన్సార్లు ఇందులో కీలకం కానున్నాయి. ఈ అను



సంధాన క్రమాన్ని రికార్డు చేయడం కోసం లేజర్ రేంజ్ ఫైండర్,ప్రాక్సిమిటి సెన్సార్లు, వీడియో మానిటర్లు ఉపయోగించారు. ఉపగ్రహాల మధ్య అటోనమస్ కమ్యూనికేషన్ కోసం కొన్ని ఇంటలిజెన్స్ పేలోడ్లను అమర్చారు. ఈ పరిశోధన విజయవంతమైతే చంద్రయాన్ ప్రయోగాలకు మాత్రమే కాకుండా భారత గగన్‌యాన్ ప్రాజెక్టుకు, స్పేస్‌స్టేషన్ నిర్మాణానికి గట్టి పునాది వేస్తుంది. అంతరిక్ష పరిశోధనలో సరికొత్త శిఖరాలను ఇస్రోశాస్త్రవేత్తలు అధిరోహించనున్నారు. 2025లో భారత్ ఎన్నెన్నో ప్రయోగాలను చేపట్టనుంది. గత ఏడాది ప్రారంభంలో, చివరలో ఇచ్చిన ఉత్సాహంతో భవిష్యత్ రాకెట్ల తయారీకి ఇస్రో వడివడిగా సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా శ్రీహరికోట నుంచి ఉపగ్రహాలను మోసుకెళ్లే రాకెట్లలో 100వ ప్రయోగం జనవరి లోనే జరపనున్నారు. జిఎస్‌ఎల్‌వి-ఎఫ్15 పేరుతో ఈ రాకెట్ ఇప్పటికే సిద్ధమయింది. వాహనచోదకులకు ఉపయోగపడే నావిగేషన్ వ్యవస్థ కోసం ఎన్ఇఎస్-02 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారా ప్రయోగిస్తున్నారు. జిఎస్‌ఎల్ వి-ఎఫ్16 పేరుతో మరో రాకెట్‌ను మార్చినెలలో ప్రయోగిస్తారు. దీని ద్వారా నిసార్ ఉపగ్రహప్రయోగం ఉంటుంది. మరో రెండు జిఎస్‌ఎల్‌వి ప్రయోగాలు కూడా 2025లోనే జరగనున్నాయి. అందులో ఒక దానిలో జిఐశాట్02, ఇంకోదానిలో ఐడిఆర్‌ఎస్‌ఎస్01 ఉపగ్రహాల ప్రయోగం ఉంటుంది. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లోను కనీసం మూడు రాకెట్లను శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తున్నారు. టిడిఎస్01 ఉపగ్రహాన్ని పిఎస్‌ఎల్‌వి-ఎన్1 రాకెట్ ద్వారా ప్రయోగిస్తారు. మరో పిఎస్‌ఎల్‌వి ద్వారా సముద్ర అన్వేషణకు ఓషన్‌శాట్ 3ని ప్రయోగిస్తారు. దీనికితోడు అన్వేష అనే ఉపగ్రహాన్ని రూపొందించి పిఎస్‌ఎల్‌వి రాకెట్ ద్వారానే ప్రయోగిస్తారు. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో ఎస్‌ఎస్‌ఎల్‌వి ఎస్1 బుల్లి రాకెట్ ద్వారా పరీక్షిత్ అనే ఉపగ్రహాన్ని 2025లోనే ప్రయోగించే అవకాశం ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే భారత్ భారీ బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3 ఎం5 ద్వారా బ్లూ బర్డ్6 ఉపగ్రహ ప్రయోగం ఉంటుంది. ఇస్రో చేపడుతున్న ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ ప్రాజెక్టులో వ్యోమగాములను కాకుండా రోబోలను పంపించే మానవ రహిత ప్రయోగం 2025 మార్చిలోనే జరుగుతుందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించి ఉన్నారు. వరుస విజయాలతో ఇస్రోకు ఎంతో ఖ్యాతి తెచ్చిన సోమనాథ్ ప్రస్తుతం గగన్‌యాన్ ప్రాజెక్టుపై ఇప్పటికే నీరు, గాలి, ఆకాశాలలో వివిధ పరిశోధనలు పూర్తి చేశారు. ప్రస్తుతం గగన్‌యాన్-జి1 పేరుతో హెచ్‌ఎల్‌విఎం3 జి1 భారీ రాకెట్ ప్రయోగానికి ఇస్రో సోమనాథ్ ఆధ్వర్యంలో సిద్ధమవుతోంది. ఈప్రయోగానికి సంబంధించి భూస్థిర పరీక్షలు, హెలికాప్టర్ పరీక్షలు, నేవీ పరీక్షలు జరుగుతూనే ఉన్నాయి. దేశంలోని ఇస్రోప్రధాన కార్యాలయాలతోపాటు ఇంకొన్నిచోట్ల కూడా ఇస్రోకు సంబంధించిన గగన్‌యాన్ పరిశోధనలు జరుపుతున్నారు. భవిష్యత్‌లో భారత్ అగ్రరాజ్యాలకు ధీటుగాకాకుండా వాటిని మించి అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాలు చేపడుతుందని దేశ ప్రజలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ●

---

రాష్ట్రం

మణిపూర్

# పశ్చాత్తాపమేనా?

**ఎ.వి.వి ప్రసాద్**

కొత్త సంవత్సర ప్రారంభవేళ.. దేశంలోని ఇతర రాష్ట్రాలన్నిటిలో సంబరాలు అంబరాన్నంటినా ఈశాన్యంలోను ముఖ్యంగా మణిపూర్‌లో అశాంతి తాండవిస్తూనే ఉంది. దాదాపు 20 నెలలుగా నిత్యం హింసాకాండతో రగిలిపోతున్నా 'చలించని' ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ సంవత్సరం ఆఖరిరోజున అంటే డిసెంబరు 31న మీడియా ముందు ప్రత్యక్షమై తానుఎంతో బాధపడుతున్నాననీ, క్షమించమని రాష్ట్రప్రజలను కోరుతున్నాననీ అటూ పశ్చాత్తాపం ప్రకటించారు. మెయితీ, కుకీ తెగల మధ్య ఎందుకు చిచ్చు రాజుకున్నదో, దానికి పరిష్కారమేమిటోఆయనకు తెలియనిదికాదు. అయినా ఆ విషయమేదీ ఆయన మీడియా సమావేశంలో ప్రస్తావించనేలేదు. కొత్త సంవత్సరంలో శాంతిని కోరుకుంటున్నాననీ, ఘర్షణపడుతున్న వర్గాలు శాంతియుతంగా వ్యవహరించాలనీ, హింసామార్గం విడనాడాలనీ హితబోధ చేశారుగాని రాష్ట్ర ముఖ్యమంత్రిగా, అన్నివర్గాల ప్రజలకు బాధ్యత వహించవలసిన నాయకునిగా అసలు సమస్యకు తాను ఎటువంటి పరిష్కారం చూపదలచుకొన్నారో చెప్పనేలేదు. ఆయన పశ్చాత్తాపాన్ని అందరు సమర్థించవలసిందే. కానీ అది నిజంగా పశ్చాత్తాపమా? లేక సరికొత్త వ్యూహమా? అనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. మెయితీలకు అనుకూలుడైన నేతగా ఆయనకు ఇప్పటికే పేరు ఉంది. మణిపూర్‌లో రెండు డజన్లపైగా తెగలు ఉన్నా ప్రధానమైన మెయితీ, కుకీలమధ్య ఆధిపత్య పోరాటం నడుస్తోంది. 2023 మే నెల 3వ తేదీన రెండుతెగల మధ్య విభేదాలు భగ్గుమన్నప్పుడే వాటికి తగిన పరిష్కారాన్ని బీరేన్ సింగ్ ఆలోచించి ఉంటే సమస్య ఇంత జటిలమై ఉండేది కాదు. దానిని రెండు తెగల వివాదంగా పరిగణించకుండా, కుకీలతో భద్రతా దళాల ఘర్షణగా అభివర్ణించడంతో తొలుత అందరూ నిజమేననుకొని సైనికులవైపే వేలెత్తిచూపడం ఆరంభించారు. అయితే బీరేన్ సింగ్ మెయితీ అనుకూల ప్రకటనలు తరచుగా చేయడంతో ఆయన మనసులోని అభిప్రాయం బయటపడింది. రక్షణ దళాల చీఫ్ అయిన అనిల్ చౌహాన్ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలన్నీ కొట్టివేయడమేగాక అది రాష్ట్రంలోని శాంతిభద్రతల సమస్యేగాని సరిహద్దు సమస్య కాదని తేల్చిచెప్పడంతో ముఖ్యమంత్రి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించారో ప్రజలకు అర్థమైంది. అప్పటి నుంచి విపక్షాలు ఆయన రాజీనామా చేయాలనే డిమాండ్ చేస్తున్నాయి. కానీ రాష్ట్రంలో ఎంతవ్యతిరేకత కనిపించినా తొణకని బెణకని బీరేన్‌సింగ్ సంవత్సరాంతం రోజున మిడియా ముందు ఎంతో బాధపడుతున్నట్లు కనిపించడంతో అది కొంగ జపంలా ఉన్నదనే విమర్శలు వినిపించాయి.



ఎన్.బీరేన్ సింగ్

యేడాదిన్నరలో 260 మందిపైగా బలైపోవడమే గాక కొన్ని వేలమంది నిరాశ్రయులయ్యారు కూడా. దాదాపు 60వేల మంది ఇంకా రక్షణ శిబిరాల్లోనే మగ్గుతున్నారు. గృహదహనాలు, లూటీలకు లెక్కేలేదు. పోలీసు స్టేషన్లు, సాయుధ రిజర్వ్ బెటాలియన్ స్థావరాలపై కూడా దాడులు నిర్నిరోధంగా సాగిపోతూనే ఉన్నాయి. వాటిని మత ఘర్షణలుగా చిత్రించే ప్రయత్నం కూడాజరిగింది. కానీ తెగల మధ్య ఘర్షణే అని తేలిన తర్వాత ముఖ్యమంత్రి సహా చాలామంది నేతలు నిశ్శబ్దంగా ఉండిపోయారు. గతవారంలో కేంద్ర హోంశాఖ విడుదలచేసిన నివేదికను జాగ్రత్తగా పరిశీలిస్తే మొత్తం ఈశాన్యప్రాంతంలో జరిగిన హింసలో 77శాతం ఒక్క మణిపూర్‌లోనే జరిగినట్లు స్పష్టమవుతుంది. అంతకుముందు సంవత్సరం కంటె రాష్ట్రంలో హింస 2024లో అనేక రెట్లు పెరిగింది. ఈశాన్య ప్రాంతంలో 243 హింసాత్మక ఘటనలు జరుగగా, వాటిలో 187 మణిపూర్‌లోనే జరిగినట్లు కూడా నివేదిక ద్వారా తెలుస్తోంది. తిరుగుబాటు అణచివేత కార్యక్రమాల్లో 33మందిని హతమార్చామనీ, 184మందిని అరెస్టు చేశామనీ, 50 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామనీ, కేంద్ర హోంశాఖ ఆ నివేదికలో వివరించింది. ఇవన్నీ చూస్తుంటే మణిపూర్‌లో పరిస్థితి ఎంత అల్లకల్లోలంగా ఉన్నదో అర్థమవుతుంది.కొన్నికొన్ని తెగలకు కేంద్రంలోని కొందరు నాయకుల మద్దతు లభిస్తున్నందువల్లనే ఈశాన్యంలో దాదాపు ప్రతిరాష్ట్రం అశాంతిలో కూరుకుపోయిందనే విషయం కూడా స్పష్టమవుతుంది. అటువంటప్పుడు ముఖ్యమంత్రి కేవలం పశ్చాత్తాపం ప్రకటించడంగాక గత యేడాదిగా తాను ఏంచేశారో, ఇకముందు ఏం చేయదలచుకున్నారో చెప్పిఉంటే దానిలో కొంత నిజాయితీ కనిపించి ఉండేది.కానీ క్షమించమని మాత్రమే ప్రజలనుకోరడంవల్ల ప్రయోజనం ఏముంది? భవిష్యత్తులో హింస ఇంకెంత పెరిగినా భరించాలని చెప్పడమే దాని అంతరార్థంగా కనిపిస్తుంది. మెయితీతెగను కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ మణిపూర్ హైకోర్టు ఇచ్చిన తీర్పు యేడాదిన్నరగా పెరిగిన అశాంతికి మూలకారణంగా చెబుతారు. ఆ తీర్పును వ్యతిరేకిస్తూ 2023 మే 3న కుకీ తెగకు చెందిన విద్యార్థులు జరిపిన ర్యాలీపై మెయితీ తెగవారు దాడులు జరపడంతో మొదలైనహింసాకాండ తర్వాత ఇంత తీవ్రరూపం దాల్చి కంటిమీద కునుకురాని పరిస్థితిని సృష్టించింది. ఆధునికకాలంలో మహిళలను నడిరోడ్డుపై సజీవదహనం చేసినఘటనలకు మణిపూర్‌నే ఉదాహరణగా చెప్పుకోవాలి.అంతటి అశాంతి అలుముకొనిఉంది. దానిని తొలగించగల ప్రణాళికను ముఖ్యమంత్రి చెప్పాలి. పశ్చాత్తాపం కాదు, కొత్త సంవత్సరంలో ఒక్క కాల్పుల ఘటనగాని, ఒక్క హత్యగాని జరగకుండా చర్యలు తీసుకొంటామని ముఖ్యమంత్రి హామీఇవ్వగలరా? క్షమాపణలు చెప్పడం కంటె ఆ హామీ ఇచ్చి ఉంటే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగి ఉండేది. కేంద్రమైనా ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాలి. కొన్ని సమస్యలు బలగాల వల్ల పరిష్కారం కావు. బుద్ధికుశలత ఉండాలి. సందర్భోచిత న్యాయమార్గం కనుగొనాలి. బీరేన్ ఇకనైనా ఆదారిలో కదలడం అవసరం. లేకుంటే మళ్లీ వచ్చే డిసెంబర్ నాటికి మరింత ఘాటైన పరిస్థితిని చవిచూడవలసి వస్తుంది. ●

---


దేశం

అమెరికా

# శిక్షలకు అతీతుడా!

**గన్ని మోహన్**

అమెరికాకు 47వ అధ్యక్షుడుగా శ్వేత సౌధంలోనికి ప్రవేశించనున్న డొనాల్డ్ ట్రంప్‌కు ఆది నుంచి కూడా సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. మొండిగా, ధైర్యంగా ముందుకు పోతూ రికార్డులు సాధించిన ట్రంప్ ఇప్పుడు మరో రికార్డు కూడా సాధించారు. శిక్ష ఖరారయి, జైలు శిక్షను అనుభవించనవసరంలేని మొట్టమొదటి అధ్యక్షుడుగా ఆయన శ్వేతసౌధంలోకి వస్తున్నారు. ఏమిటీ వింత కథా కమామీషు అంటే అందరికి విచిత్రంగానే ఉంది. హష్ మనీ కేసు విచారణ ఎదుర్కొంటున్న ట్రంప్‌కు ఈ శిక్ష ఖరారు చేసారు. అయితే ఏ శిక్ష విధిస్తామన్నది ఈనెల 10వ తేదీ ప్రకటిస్తామని న్యూయార్క్ కోర్టు న్యాయమూర్తి హవాన్ మర్చన్ పేర్కొన్నారు. ఈ కేసులో ట్రంప్ శిక్షను అనుభవించాల్సిన అవసరం లేదని, జరిమానా కూడా విధిస్తామని, అయినా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేయడం అమెరికా న్యాయవ్యవస్థలోనే అత్యంత అరుదయిన, విచిత్రమైన కేసుగా ట్రంప్ కేసు నిలుస్తోంది. ఎలాంటి శిక్షను అనుభవించాల్సిన అవసరం లేకుండా తనకున్న విచక్షణాధికారాలు ఉపయోగించి బేషరతు డిశ్చార్జి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. అలాగే సహజంగా తీర్పు చెప్పేరోజు కేసులో నిందితులు విధిగా హాజరు కావాలి. అయితే ట్రంప్‌కు మరో వెసులుబాటును కూడా న్యాయమూర్తి కల్పించారు. ఆయన వర్చువల్‌గా కూడా హాజరు కావచ్చని తెలిపారు. అసలు ఏమిటీ హష్‌మనీ కేసు అంటే 2016 నాటి సంఘటన అని చెప్పాలి. శృంగార తార స్టార్మీ డేనియల్‌తో ట్రంప్ ఏకాంతంగా గడిపారన్న ఆరోపణలు వచ్చాయి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఆమె ఈ సంఘటనపై నోరు విప్పకుండా ఉండేందుకు ట్రంప్ తన న్యాయవాది ద్వారా ఆమెకు 1.30 లక్షల డాలర్లు ముట్టచెప్పారని ప్రధాన అభియోగం. ప్రచార కార్యక్రమాల కోసం అందిన విరాళాల నుంచి ఈ మొత్తాన్ని ఖర్చు చేసారని, అందుకోసం రికార్డులన్నింటినీ తారుమారు చేసారన్నది ట్రంప్ ఎదుర్కొంటున్న ప్రధాన అ భియోగం. ఈ కేసులో స్టార్మీడేనియల్‌తోపాటు మొత్తం 22 మంది సాక్షులను విచారించిన 12 మంది న్యాయమూర్తుల ధర్మాసనం ట్రంప్‌పై నమోదయిన అభియోగాలన్నీ వాస్తవమేనని నిర్ధారించింది. ట్రంప్ తనతో ఏకాంతంగా గడిపారని శృంగార తార కూడా వాంగ్మూలం ఇచ్చింది. మొత్తం 34 అంశాలపై వచ్చిన నేరారోపణలను విచారించిన న్యాయస్థానం తీర్పును మాత్రం వెలువరించలేదు. శిక్ష ఖరారవుతున్న తరుణంలో అమెరికా కొత్త అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నికయ్యారు. క్రిమినల్ విచారణ ఎదుర్కొనకుండా రక్షణ ఉంటుందని అమెరికా సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ ఆయన అప్పీలుచేసి రక్షణ పొందారు.



డొనాల్డ్‌ట్రంప్

విచారణ జరిపిన న్యాయస్థానం కేసుకు సంబంధించిన శిక్షను నిరవధికంగా వాయిదా వేసింది. అయితే ట్రంప్‌నకు ఈకేసు నుంచి రక్షణ పొందే అవకాశాలు మాత్రం లేవని వెల్లడించింది. 20వ తేదీ శ్వేతసౌధంలోకి ట్రంప్ ప్రవేశిస్తుండగా పదిరోజులకు ముందు అంటే ఈనెల 10వ తేదీ ఈకేసు తీర్పుచెపుతానని జడ్జి జస్టిస్ హవాన్ మర్చన్ చెప్పడం గమనార్హం. ఆధారాలన్నీ రుజువయిన తర్వాత శిక్షను వేయ కపోతే న్యాయవ్యవస్థను కించపరిచినట్లవుతుంది. శిక్ష విధిస్తూ తీర్పు చెపుతామని ధర్మాసనం చీఫ్‌కు ఉన్న విచక్షణతో అన్‌కండిషనల్ డిశ్చార్జి అమలు చేస్తానని న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసారు. రిపబ్లికన్ నేత కొత్త అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు ఇలాంటి లైంగిక వేధింపుల కేసులు కొత్తేమీకాదు. ఇప్పటికే డజనుకుపైగా ఈతరహా కేసులు ఆయనపై నమోదయ్యాయి. కొన్ని జరిమానాలు,మరి కొన్ని తీర్పు వెలువడని కేసులుగా ఉన్నాయి. ఈ క్రమంలోనే ప్రముఖ రచయిత్రి జీన్ కారోల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అభియోగాలు రుజువుకావడంతో ఐదు మిలియన్ డాలర్లు జరిమానా విధించారు. దీనిపై అప్పీలు చేసుకున్నా ఫెడరల్ అప్పీలు కోర్టు దిగువకోర్టు తీర్పును సమర్థించింది. తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన న్యూయార్క్ జ్యూరీ గత ఏడాది మే నెలలోనే ట్రంప్‌ను దోషిగా నిర్ధారించింది. ఫలితంగా భారత కరెన్సీప్రకారం 42కోట్లు జరిమానా చెల్లించాలని ఆదేశించింది. రచయిత్రి చేసిన అత్యాచారం ఆరోపణలుమాత్రం తోసిపుచ్చిన న్యాయస్థానం ఆమె పరువుకుభంగం కలిగినందున పరిహారం చెల్లించాలని స్పష్టం చేసింది. మన్‌హట్టన్‌లోని లగ్జరీ డిపార్టుమెంటల్ స్టోర్‌లో దుస్తులు మార్చుకునే గదిలో తానుండగాలోపలికి దూరి అత్యాచారం చేసినట్లు ఆమెఆరోపించింది. ట్రంప్‌ను దోషిగా నిర్ధారించి జీన్ కారోల్‌కురెండు మిలియన్ డాలర్లు పరువునష్టం కింద మూడు మిలియన్‌డాలర్లు మొత్తం ఐదుమిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశించింది. ట్రంప్ అప్పీలుకు వెళ్లడంతో ఫెడరల్‌కోర్టు తన తుదితీర్పు వెలువరించింది. వాస్తవానికి కరోల్‌కు 83 మిలియన్ డాలర్లు చెల్లించాలని గతంలోఒక జ్యూరీట్రంప్‌ను ఆదేశించింది. దీనిపైనా అప్పీలుకు వెళ్లడంతో ఇప్పుడు ఐదుమిలియన్ డాలర్లకు తగ్గింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఎన్నిక కావ డంతో ఆయనపై ఉన్న రెండు ఫెడరల్‌కేసులను ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ఇవి రాజకీయ కోణంలో నమోదైన కేసులయితే ఇప్పుడున్న కేసులు లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులు కావడంతో ట్రంప్ శిక్షలు ఎదుర్కొనే పరిస్థితివచ్చింది. కేవలం ఇవే కాకుండా అమెరికా పార్లమెంటు భవనంక్యాపిటల్ హిల్స్‌పై దాడికేసు ట్రంప్‌నుఎక్కువగా చిక్కుల్లోకి నెట్టింది. కేసుల సంగతి పక్కనపెడితే ఎన్నికయ్యాక ట్రంప్ చేస్తున్న ప్రకటనలు కూడా ప్రజలను గందరగోళంలోకి నెట్టివేస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం, హెచ్‌వన్‌బి వీసాలు, యూరోప్‌పై ఆంక్షలువంటివి ట్రంప్‌చేసిన హెచ్చరికల్లో మచ్చుకు కొన్నిమాత్రమే. శిక్షలు జరిమానాల సంగతి పక్కన పెడితేశిక్షపడిన అమెరికా తొలిఅధ్యక్షుడుగాట్రంప్ ఇప్పుడు శ్వేతసౌధంలోకిప్రవే శిస్తున్న మొట్టమొదటి అధ్యక్షుడుగా రికార్డు సాధించడం అమెరికా చరిత్రలోనే ప్రత్యేక ఘట్టం అనిచెప్పాల్సిందే. ●

---

# ఇ-కామర్స్ హుషారు.. చిల్లర వర్తకులు బేజారు



యేచన్ చంద్రశేఖర్

కిరాణా దుకాణాలు ఇంకా మనుగడలోకి రాక పూర్వం క్రయవిక్రయాలన్నీ కూడా వస్తుమార్పిడి విధానంలోనే (బార్టర్ సిస్టం) జరిగేవి. ఈ విధానంలో లావాదేవీలు సాధారణంగా ఉత్పత్తిదారుడు, వినియోగదారుని మధ్య నేరుగా జరిగేవి. తదనంతరం మానవ జీవన విధానంలో సంభవించిన మార్పులు, కరెన్సీ లేదా డబ్బు చెలామణిలోకి వచ్చిన నేపథ్యంలో వాణిజ్య, వర్తక,వ్యాపార కార్యకలాపాలు క్రమంగా ఊపందుకున్నాయి. ఈ పరిణామ క్రమంలోనే స్థానికులకు వారి దైనందిన జీవితంలో అవసరమయ్యే నిత్యావసర సరుకులను విక్రయించేందుకు కిరాణా దుకాణాలు మనుగడలోకి వచ్చాయి. నాటినుండి ఇవి తరతరాలుగా భారతీయ సమాజంలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయన్న విషయం మనందరికీ తెలుసు. కిరాణా దుకాణాలు నిర్వహించే చిరువ్యాపారులు సాధారణంగా నిత్యావసరుకులను విక్రయిస్తూ స్థానికులతో వ్యక్తిగత సంబంధాలు నెరుపుతూ తమదైన శైలిలో సేవలు అందిస్తున్నారు. వంశపారంపర్యంగా వ్యాపారం నిర్వహించే వీరు అవసరమైతే స్థానికులకు అరువుపై సరుకులు ఇవ్వడం, కొనుగోలుదారుల ఇళ్లకు సరుకులు చేరవేయడం లాంటి వ్యక్తిగతీకరించిన సేవలు అందించి వారి మెప్పు పొందుతున్నారు.మార్చి 2023 నాటికి, భారతదేశంలో దాదాపు 13 మిలియన్ల (ఒక కోటి ముప్పై లక్షలు) కిరాణా దుకాణాలు ఉండగా వాటిలో దాదాపు ఒక కోటి కిరాణా దుకాణాలు ద్వితీయ శ్రేణి, చిన్న నగరాలు లేదా పట్టణాలలో ఉన్నట్లు అంచనా. భారతీయ రిటైల్ రంగం మొత్తంలో దాదాపు 90 శాతం వాటా కుటుంబ యాజమాన్యంలో నిర్వహించబడే ఈ చిరువ్యాపారుల ద్వారానే జరుగుతున్నదంటే ఆశ్చర్యం కలుగక మానదు. కాగా ఇటీవలి కాలంలో వేగంగా విస్తరిస్తున్న ఈకామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ పోటీ కారణంగా కిరాణా దుకాణాల సంఖ్య తగ్గడంతో పాటు చిల్లర వర్తకులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ సౌకర్యం మెట్రో, ద్వితీయ,తృతీయ శ్రేణినగరాలతో పాటు పల్లెటూర్లకు సైతం విస్తరిస్తుండడంతో కేవలం ఒక్క సంవత్సరంలోనే దాదాపు రెండులక్షల కిరాణా దుకాణాలు మూతబడ్డాయని ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (ఏఐసిపిడిఎఫ్) ఇటీవల ప్రకటించింది. కొన్ని ప్రముఖ విదేశీ ఇకామర్స్ సంస్థలు ఏకచ్ఛత్రాధిపత్యం కొనసాగిస్తుండగా, ఇటీవల జోమాటో, బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ జెప్టో లాంటి సంస్థలు భారతదేశంలోని కిరాణా దుకాణాల మనుగడను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. సరసమైన ధరలు త్వరితగతంగా సరుకుల అందచేత కారణంగా ముఖ్యంగా మెట్రో నగరాలలో ఇవి పెద్ద ముప్పుగా పరిణమిస్తూ అత్యధిక ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రధానంగా ఇవి మెట్రో నగరాల్లో కేంద్రీకృతమై ఉండడంతో ఈ ప్రాంతాల్లోనే 90,000 కిరాణా దుకాణాలు మూతబడ్డాయి. అంతేకాకుండా ప్రథమ శ్రేణినగరాల్లో 60,000 ద్వితీయ,తృతీయ శ్రేణినగరాల్లో 50,000 దుకాణాలు మూతబడ్డాయి. ఈకామర్స్ సంస్థలు ఆకర్షణీయమైన డిస్కౌంట్స్‌తో వినియోగదారులను ఆకర్షిస్తూ తక్కువ ధరలకు వస్తువులను విక్రయిస్తుండడంతో తరతరాలుగా భారతదేశ రిటైల్ రంగానికి కేంద్రంగా ఉన్న ఈసాంప్రదాయ కిరాణా దుకాణాల వినియోగదారుల సంఖ్యతోపాటు లాభదాయకత కూడా క్షీణిస్తున్నదని సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ధైర్యశిల్ పాటిల్ పేర్కొన్నారు. దీనికితోడు ఆర్థిక మాంద్యం కూడా సాంప్రదాయ చిల్లర వ్యాపారులు తమ కార్యకలాపాలను బలవంతంగా మూసివేసేలా ప్రేరేపిస్తున్నాయని ఆయన వాపోయారు. వినియోగదారుల ప్రాధాన్యతల మార్పు కారణంగా తమ ఉత్పత్తులకు ఈకామర్స్ మాధ్యమం ద్వారా డిమాండ్ పెరగడాన్ని ఇటీవలి కాలంలో అనేక కంపెనీలు గుర్తించాయి. ప్రత్యేకించి పండుగ సమయాలలో, డీలర్లు లేదా డిస్ట్రిబ్యూటర్లు లేకుండా నేరుగా వినియోగదారునికి అందచేసే డైరెక్ట్ టు కస్టమర్ బ్రాండ్‌లకు ఈకామర్స్ మాధ్యమం ద్వారా గతేడాదితో పోలిస్తే 250శాతం వరకు అధిక విక్రయాలు జరిగినట్లు ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది. ఈకామర్స్



ఆన్‌లైన్ షాపింగ్‌తో పాటు సూపర్ మార్కెట్లు, మోడ్రన్ స్టోర్‌ల పోటీ కారణంగా కిరాణా దుకాణాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఒక పక్క ఈ సవాళ్లను ఎదుర్కొంటూనే కిరాణా దుకాణాదారులు మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా క్రెడిట్, డెబిట్ కార్డులు,డిజిటల్ చెల్లింపుల సౌలభ్యం కల్పిస్తూ పలురకాల సేవలను అందిస్తున్నాయి. గత రెండు మూడు సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం కిరాణా దుకాణాలకు కొనుగోలుదారుల తాకిడి దాదాపు సగానికి తగ్గిందని పరిశ్రమ సంఘం తెలిపింది. త్వరిత వాణిజ్యం (క్విక్ కామర్స్)లాంటి ఆన్‌లైన్ సంస్థలు అందించే డిస్కౌంట్‌లతో తమ ధరలను సరిపోల్చడానికి కిరాణా దుకాణాదారులపై ఒత్తిడి తీవ్రమవడంతో పాటు వారి లాభాలు పూర్తిగా కుంచించుకుపోతున్నాయి. స్థిరమైన ప్రామాణిక పద్ధతులకు బదులు వినియోగదారులను స్వల్పకాలిక లాభాలతో ప్రలోభ పెట్టే వ్యూహాలకు ఈ సంస్థలు ప్రాధాన్యత ఇవ్వడంతో, దేశవ్యాప్తంగా దాదాపు 200,000 కిరాణా దుకాణాలు మూతబడ్డాయి. చిల్లర వ్యాపారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు దేశంలో త్వరిత వాణిజ్యంపై నిబంధనలు విధించాలని ఏఐసిపిడిఎఫ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అనైతిక మార్కెటింగ్ విధానాలు నిర్హేతుకమైన అమ్మకపు ధరల కారణంగా సంప్రదాయ చిల్లర వ్యాపారులు వారితో పోటీ పడటం లేదా వ్యాపారంలో కొనసాగడంపెను సవాలుగా మారుతోందని, దీనిపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ ఇటీవల కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)కి రాసిన లేఖలో పేర్కొంది. ఈ సంవత్సరం అక్టోబర్ 31న దీపావళి పండుగ ఉన్నప్పటికీ నగరాలు పట్టణాలలోని కిరాణా దుకాణాలలో అమ్మకాలు భారీగా క్షీణించాయి. భారతదేశంలో త్వరగా అమ్ముడుపోయే నిత్యావసర వస్తువులను (ఫాస్ట్‌మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ ఎఫ్ఎంసిజి) ఉత్పత్తి చేసే కంపెనీలు త్వరిత వాణిజ్య విక్రయాలలో తాము గణనీయమైన వృద్ధి సాధించినట్లు నివేదించినప్పటికీ, సాధారణ వాణిజ్య పంపిణీదారుల నెలవారీ అమ్మకాలు మాత్రం ఈ ఏడాది జూలై నుండి అక్టోబర్ నెలాఖరు వరకు 25 నుండి 30 శాతం క్షీణించాయని ఎకనామిక్ టైమ్స్ నివేదించింది. క్విక్ కామర్స్ లేదా త్వరిత వాణిజ్యం కార్యకలాపాలు దేశంలోని ప్రధాన నగరాల్లో వేగంగా విస్తరిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని వినియోగదారుల మారుతున్న షాపింగ్ అలవాట్లను నిశితంగా అధ్యయనం చేస్తూ అందుకు అనుగుణంగా డాబర్ నెస్లే లాంటి కొన్ని ఎఫ్ఎంసిజి దిగ్గజాలు, సాధారణ వాణిజ్యంలో తమ వ్యూహాలు ప్రణాళికలను ఎప్పటికప్పుడు మార్చుకుంటున్నప్పటికీ, ఎఫ్ఎంసిజి ఉత్పత్తులకు ఇప్పటికీ కిరాణా దుకాణాలు ప్రధాన అమ్మకపు వనరులుగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జూలైసెప్టెంబర్ కాలంలో నెస్లే కంపెనీ ఈకామర్స్ విక్రయాలు ఏడేళ్ల గరిష్ట స్థాయికి చేరుకున్నాయని, ఇప్పుడు ఆన్‌లైన్ విక్రయాలు మొత్తం దేశీయ విక్రయాల్లో 8.3శాతం కాగా శీఘ్ర వాణిజ్యంవాటా అందులో సగానికిపైగా ఉందని సంస్థ ఛైర్మన్ పేర్కొన్నట్లు నివేదిక వెల్లడించింది. డాటమ్ నివేదిక ప్రకారం,భారతదేశంలో సాంప్రదాయ కిరాణాస్టోర్‌ల మార్కెట్‌వాటా 2018లో 95శాతం నుండి 2023లో 92.6 శాతానికి పడిపోయిందని 2028నాటికి ఇది 88.9 శాతానికి పడిపోతుందని అంచనా. 82 శాతం మంది క్విక్ కామర్స్ వినియోగదారులు తమ కొనుగోళ్లలో కనీసం 25 శాతాన్ని కిరాణా దుకాణాల నుండి తగ్గించినట్లు, 5 శాతం మంది కిరాణా దుకాణాల నుండి కొనుగోళ్లు పూర్తిగా నిలిపివేసినట్లు సర్వేలో వెల్లడైందని ఈ నివేదిక తెలిపింది. మధ్యవర్తుల తొలగింపు ద్వారా ఉత్పత్తులు సరసమైన ధరలకు ఈకామర్స్ ద్వారా లభించడంతో పాటు వారి క్రమబద్ధమైన డెలివరీ విధానాలు వినియోగదారుల మన్ననలు చూరగొంటున్నాయి. ఈ సంస్థల ఆకర్షణీయమైన ప్రకటనలకు ప్రభావితమై వినియోగదారులు అవసరం ఉన్నా లేకపోయినా తమ బడ్జెట్‌కు మించి కొనుగోలు చేస్తున్నారు. మారుతున్న వినియోగదారుల ప్రవర్తన నేపథ్యంలో చాలా కుటుంబాలు సకుటుంబంగా షాపింగ్‌కు వెళ్తున్నారు. వాటితో పోటీపడలేక సాంప్రదాయ చిరు వ్యాపారుల అమ్మకాలు నేలచూపులు చూస్తున్నాయన్న మాట వాస్తవం. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉభయవర్గాల ప్రయోజనాలను పరిరక్షించే విధంగా సముచితమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం సర్వత్రా వాంఛనీయం. ●

07ATP04_07ATP04.qxd 04-01-2025 PM 11:04 Page 1



## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం



పథకాన్ని ప్రారంభిస్తున్న టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ మనోహర్

**ముదిగుబ్బ, జనవరి 4 ప్రభాతవార్త**

ముదిగుబ్బ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముదిగుబ్బ పట్టణ సిఐ శివరాముడు, టిడిపి మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా మధ్యాహ్న భోజనం పథకానికి టిడిపి ప్రభుత్వం కట్టుబడి డొక్కా సీతమ్మ పేరిట ఈ పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కళాశాలలకు వచ్చే నిరుపేద విద్యార్థులు, ఆర్థికంగా చితికిపోయిన విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అందించడం పట్ల కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఇఒ రమణప్ప, కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, జనసేన మండల కన్వీనర్ గుర్రం జయచంద్ర, ముదిగుబ్బ బాలురు, బాలికల పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యుల సమావేశం



భోజనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

**పుట్లూరు, జనవరి 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఏపిఎంఎస్ స్కూల్‌లో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. చైర్మన్ నారాయణస్వామి, ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బాలల హక్కులు, వారి యొక్క పరిరక్షణ సభ్యుల విధి విధానాలు, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, సామాజిక తనిఖీ, ప్రజల భాగస్వామ్యం తల్లిదండ్రుల భాగస్వామ్యం వాటి యొక్క పరిష్కార మార్గాలు అభివృద్ధి ప్రణాళిక గురించి చర్చించారు. ఇందులో భాగంగా స్కూల్‌లోని టాయిలెట్లను చైర్మన్, సభ్యులు, ప్రిన్సిపాల్ పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- సిడిపిఒ సాజిదాబేగం



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

**యాడికి, జనవరి 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపిడిఒ సమావేశ భవనంలో శనివారం సిడిపిఒ సాజిదాబేగం ఆధ్వర్యంలో అంగన్‌వాడి ఆరోగ్య సచివాలయం సిబ్బందికి బాల్య వివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. వాటి వల్ల కలుగు దుష్పరిణామాలు, తల్లి పిల్లల ఆరోగ్య పరిస్థితులు, తదితర వాటి గురించి వివరించారు. నిత్యం ప్రజలతో మమేకమై బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాల గురించి వివరించాలని ఆమె పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడి సిబ్బంది, వైద్య సిబ్బంది సుమతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలూరుకోనలో ధనుర్మాసం పూజలు



శ్రీరంగనాథస్వామిని అలంకరించిన దృశ్యం

**తాడిపత్రిరూరల్, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని ఆలూరుకోనలో వెలసిన శ్రీరంగనాథస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసం పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామిని వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు కోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజినేయులు, సిబ్బంది కాశీ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**పుట్లూరు, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని కడవకల్లు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజినేయులు, గ్రామ పెద్దలు బి.వెంకటరామిరెడ్డి, సర్పంచు రామాంజనేయులు, తలారి శివకేశవ, బాలనరసింహుడు శనివారం గ్రామ సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఈ నెల 18, 19 తేదీల్లో పెద్దమ్మతల్లి దేవర జరుగుతున్న నేపథ్యంలో గ్రామంలోని వీధిల్లో వీధిలైట్లు మరమ్మతులు చేయాలని, వీధులను శుభ్రం చేయించాలని, ఇళ్ల మధ్య వున్న కంపచెట్లను తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఎన్.గోపాలకృష్ణ, మండల నాయకులు చిన్న కుళ్లాయప్ప, గ్రామన ప్రజలు ఎం.దావీదు, హనుమంతు, బాష, వలిబాష, మరియమ్మ, రంగమ్మ, మేరీ పాల్గొన్నారు.

## ప్రపంచ లూయిస్ బ్రెయిలీ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఇఒ

**పుట్లూరు, జనవరి 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని పుట్లూరు-2 పాఠశాలలో శనివారం ప్రపంచ అంధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ-2 ప్రేమకుమార్ హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఆయన స్ఫూర్తితో చాలా మంది అంధులు అన్ని రంగాల్లో ఉద్యోగాలు సాధించారని తెలియచేశారు. ఆయన స్ఫూర్తితోనే అంధుల పిల్లలు ముందుకు సాగాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎస్ మెయిన్ స్కూల్ హెచ్‌ఎం, ఐఇఆర్‌పిలు సుదర్శన్‌రెడ్డి, వాణిశ్రీ, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌సి కులగణన తప్పుల జాబితాను సవరించండి



డిప్యూటి శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**యాడికి, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలో ప్రభుత్వం చేపట్టిన ఎస్‌సి కులగణన తప్పుల జాబితాను సమరించాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ నాయకులు శనివారం డిప్యూటి తహశీల్దార్ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి శశికళకు వినతిపత్రం అందచేశారు. ఆయా సచివాలయాల పరిధిలో సచివాయం సిబ్బంది ఎస్‌సి జాబితాను గ్రామాల పర్యటన చేసి జాబితాను సిద్ధం చేసినట్లు కొన్ని గ్రామాల్లో ఎస్‌సి కుటుంబంలోని వ్యక్తుల పేర్లను మాదిగ క్రిస్టియన్‌గా మాదిగలను మాలలుగా చూపించడం జరిగిందని సచివాలయం పరిధిలో వున్న సచివాలయం అధికారులు ఇంత వరకు కుల గణన నిర్వహిస్తున్నట్లు సమాచారం మాదిగలకు తెలియచేయకుండా నోటీసుబోర్డులో .జాబితాను అంటించకుండా వ్యవహరిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని జాబితాలో తప్పులను సరి చేసుకునేందుకు ఈ నెల 7వతేదీ పూర్తి కానున్నట్లు వారు తెలిపారు. సచివాలయం ఉద్యోగులు ప్రతి గ్రామంలో మాదిగల ఇంటికి వెళ్లి ఎస్‌సి కులగణన జాబితాను వివరించి తప్పులను సరిచేసే విధంగా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపి పుల్లయ్య, తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జి.నరసింహులు, యాడికి మండల అధ్యక్షులు రంగస్వామి, నగరూరు వెంకటేష్, ఓబులన్న, పెద్దిరాజు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఇఒ కాశెప్ప

**యాడికి, జనవరి 4 ప్రభాతవార్త**

ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాధికారి కాశెప్ప రాయలచెరువు గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అన్నం, పప్పు, తదితర వాటిని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మారుతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన షేక్‌మాబున్నీ

**తాడిపత్రిటౌన్, జనవరి 4 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలం తాతగారిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్‌మాబున్నీ అనే మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా వున్నాయి. పట్టణంలోని కుమ్మరిగేరి నందలపాడుకు చెందిన షేక్‌మాబున్నీ తాతగారిపల్లి వద్ద పొలంలో పనులు చేసుకుంటుండగా ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ఆమెను ఢీ కొన్నాడు. ఈ సంఘటనలో షేక్‌మాబున్నీ అక్కడికక్కడే మృతి చెందింది. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## హైందవ శంఖారావం బహిరంగసభకు బయలుదేరిన తాడిపత్రి ప్రజలు



విజయవాడకు వెళుతున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, జనవరి 4 ప్రభాతవార్త**

విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో తలపెట్టిన హైందవ శంఖారావం బహిరంగసభకు లక్షలాదిగా తరలిరావాలంటూ హిందువులు పిలుపునిచ్చారు. ఈ బహిరంగసభలో పాల్గొనేందుకు తాడిపత్రి విశ్వహిందూపరిషత్, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్ తదితర సంఘాల వారితో పాటు తాడిపత్రి ప్రజలు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా హిందువుల దేవాలయాలను హిందువులే పరిరక్షించేలా హిందు దేవాలయాల్లో అన్యమతస్తులను తొలగించి హిందువులనే ఉద్యోగులుగా వుండాలని, దీనిపై ప్రభుత్వాలు వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కారం చేయాలన్న లక్ష్యంతో హైందవ శంఖారావం భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విజయవాడలోని లైలా గ్రీన్ మెడోస్, కేసరపల్లి గన్నవరం విమానాశ్రయం వద్ద ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సభను నిర్వహించనున్నారు.

## నాటుసారా ఊట ధ్వంసం

**నంబులపూలకుంట, జనవరి 4 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నల్లగుట్ట పల్లి తండా శజవారులో 300 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్సై వలి బాషా తెలిపారు. శనివారం ఉదయం తండా సమీపంలో నాటుసారా వండుతున్నారన్న సమాచారంతో తన సిబ్బందితో అక్కడికి చేరుకొని నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం పానీయాన్ని పారవేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నింధితుడు రమేష్‌నాయక్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైతోపాటు కానిస్టేబుల్ జనార్ధన్‌రెడ్డి, హోం గార్డులు కుమార్‌బాబు, రాజు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆకలి తీర్చేందుకే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం



మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తున్న ఆర్డిఓ

**కదిరి, జనవరి 4 ప్రభాతవార్త**

విద్యార్థుల ఆకలి తీర్చేందుకే రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఆర్డిఓ వివిఎస్ శర్మ పేర్కొన్నారు. శనివారం కదిరి పట్టణంలోని బాలికల జూనియర్‌కళాశాలలో కదిరి ఆర్డిఓ వివిఎస్ శర్మ చేతుల మీదుగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ.. ఇంటర్మిడియెట్ చదువుతున్న విద్యార్థుల ఆకలి తీర్చడంతోపాటు డ్రాపౌట్ల సంఖ్య తగ్గుతుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని చెప్పారు. ఈ పథకం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరపున విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆర్డిఓతోపాటు మండల విద్యాశాఖాధికారి ఓబులరెడి ్డ కళాశాల ప్రిన్సిపాల్ యం.వెంకటేశ్వర ప్రసాద్ పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఆ తర్వాత వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యం.యస్.ప్రశాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

**తలుపుల,జనవరి4, ప్రభాతవార్త**

గ్రామాల్లో తాగునీటి, విద్యుత్, విద్యుత్ దీపాలు, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ రఫీ నాయక్ అధికారులకు సూచించారు. శనివారం వెలుగు కార్యాలయంలో ఎంపీపీ రఫీ నాయక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నివేదికను చదివి వినిపించారు. ఏవో షాదాబ్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని అలాగే తలుపులు మండలంను కరువు మండలగా ప్రకటించడంతో రెండు మూడు రోజులలో కరువు మండలంపై పరిశీలనకు కేంద్ర బృందం వచ్చే అవకాశం ఉందని కేంద్ర బృందానికి రైతులు తమ సమస్యలు ను వినత పత్రాలు అందజేయాలన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డబ్ల్యూజేఈ తెలిపారు. ఇల్లు లేని పేదలు ఎవరైనా ఉంటే ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ భాను ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఫీ నాయక్ మాట్లాడుతూ మూడు నెలలు జరిగే సర్వసభ్య సమావేశాన్ని కూడా అధికారులు దుమ్మా కొడుతున్నారని, వచ్చిన అధికారులు కూడా సమన్వయం పాటించలేదని అధికారులు వస్తే కదా తమ ప్రజా ప్రతినిధులు సమస్యలు తెలిపేది అని ప్రశ్నించారు. కావున అధికారులు ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా మండల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే రామా నాయక్, వైస్ ఎంపీపీ ఓబులేశ్వరమ్మ,సర్పంచ్ శ్రీలత వైద్యాధికారి అల్తాఫ్ ఎంపీటీసీలు, సర్పంచులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

**తలుపుల,జనవరి4, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామా నాయక్, ఎంఈఓ వెంకట్రాముడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆకలి తీర్చాలని ఉద్దేశంతో ఎన్డీఏ ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించడం జరిగిందని కళాశాల విద్యార్థులు వీటిని వినియోగించుకోవాలని తెలిపారు. అంతేకాక బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి కళాశాలకు, అధ్యాపకులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజాన్ని నిర్భయంగా వెలికి తీసే పత్రిక వార్తాపత్రిక : ఎస్సైనరసింహుడు

**తలుపుల, జనవరి 4 ప్రభాతవార్త**

నిజాన్ని నిర్భయంగా వెలికి తీసే పత్రిక జాతీయ వార్త పత్రిక ని ఎస్ఐ నరసింహుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో వార్తాపత్రిక క్యాలెండర్ ను ఎస్ఐ నరసింహుడు చేతులు మీదుగా వార్త విలేకరి అల్లాబక్ష ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెలుగులోకి తీసుకొచ్చి వార్తాపత్రిక ముందు ఉన్నదన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే మంచి కథనాలను ప్రచురించి ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గుర్రప్ప, ఈశ్వర్ నాయక్, బాబు నాయక్, తిరుమలేష్ సిపిఐ నాయకులు ఈశ్వరయ్య, ఎల్వి రమణ, అంజన్ బాబు, దివాన్ వలి పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం



భోజనం చేస్తున్న విద్యార్థులు

**అమడగూరు, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని సీతరెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం అన్నదాత డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పథకాన్నిన ప్రారంభించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించడం ఎంతో శుభ పరిణామమన్నారు. అమడగూరు మండలంలో జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఇఒ-2 సంపూర్ణ, మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, రామాంజులనాయుడు, రాజారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం కార్యక్రమానికి తరలిన అమడగూరు వాసులు

**అమడగూరు, జనవరి 4 ప్రభాతవార్త**

విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావం కార్యక్రమానికి అమడగూరు నుండి పెద్దఎత్తున తరలివెళ్లారు. ముందుగా మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరి కళ్యాణమండపంలో శనివారం బిజెపి ఆధ్వర్యంలో బహిరంగసభ నిర్వహించారు. దేవాలయాల ఆదాయాన్ని కేవలం ధర్మ ప్రచారానికి వినియోగించాలని హిందువులను మనోభావాలను సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వాలు వెంటనే స్పందించాలన్న లక్ష్యంతో విజయవాడలో హైందవ శంఖారావం పేరిట భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ వాహనాల్లో భారీ ఎత్తున విజయవాడకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ హరినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసులు, బిజెపి ఆర్గానిక్ స్టేట్ కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డి, ఉప్పు రామయ్య, సీనియర్ నాయకులు ఐ.రాము, మండల కన్వీనర్ వేమనారాయణ, మాజీ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, వెంకట్‌నారాయణ, కిసాన్ మోర్చా బూత్ అధ్యక్షులు ఇందుకూరు మాధవరెడ్డి, విశ్వహిందూపరిషత్ మండల అధ్యక్షులు కె.సుబ్రమణ్యం, ప్రఖండ సంఘటన కార్యదర్శి డి.లీలావతి, పి.ఆంజనేయులు, హరీష్, భజన కళాకారుల మండల అధ్యక్షులు బి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ లూయి బ్రెయిలీ దినోత్సవం



విద్యార్థులకు స్కూల్ పరికరాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు మార్టిన్

**నల్లచెరువు, జనవరి 04 ప్రభాతవార్త**

నల్లచెరువు మండల కేంద్రంలోని భవిత కేంద్రం నందు ప్రపంచ లూయి బ్రెయిలీ దినోత్సవం కార్యక్రమాన్ని ప్రత్యేక ఉపాధ్యాయుడు కే.నరసింహుడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవయవాల్లో లోపం వల్ల శరీరానికి కానీ మనసుకు కాదు అని దృష్టిలోకి ఉన్నప్పటికి మనోనేత్రం ఉంటుందని అనే అంకితభావంతో పనిచేయాలని సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలమని తెలిపారు. అదే విధంగా ప్రధాన ఉపాధ్యాయుడు కే.నరసింహుడు మాట్లాడుతూ తండ్రి గురించి చిన్న వయసులో కన్నుకోవడం తర్వాత రెండవ కన్ను ఏవిధంగా కోల్పోయాడో ఆరు చుక్కల బ్రీలీ లిపి ఏవిధంగా కనుగొన్నాడని మొదలగు విషయాల గురించి తెలియజేశారు. ఉపాధ్యాయులు గౌస్‌ఖాన్ ప్రసంగిస్తూ బ్రీలీ కన్ను కోల్పోయిన విధానం కలిపి కనుగొన్న విధానం అలిపి ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన విధానం ఇలిపి వల్ల అందులో వెలుగు నింపిందని తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బ్రెయిలీ కళ్ళు లేవని అధైర్యపడకుండా రాబోవు తరాల వారికి స్ర్తీని లిపిని కనిపెట్టి ఎంతో మందికి ఆదర్శప్రాయుడు అయ్యారని, భవిత స్కూల్ పిల్లలు విద్యాభ్యాసం బాగా చదువుకుని మంచి స్థానం సంపాదించాలని ప్రతి సంవత్సరం లాయి బ్రీలీ దినోత్సవంకు కార్యక్రమములు నిర్వహించబడునని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మార్టిన్, హెల్పింగ్ హ్యాండ్ ద్వారా భవిత కేంద్రమునకు కేలం బోర్డు 3మ్యాట్లు విద్యార్థులకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో శివశంకర్‌రెడ్డి, అశోక్, హరినాథ్‌రెడ్డి, నాగభూషణ, సంధ్య, రూపపతి, వినయ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహశీల్దారు దేవేంద్రనాయక్

**నంబులపూలకుంట, జనవరి 4 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు కార్యక్రమాన్ని శనివారం మండల పరిధిలోని వంకమద్ది గ్రామంలో ఎంపిపి ఈటే రాము అధ్యక్షతన తహశీల్దార్ దేవేంద్రనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో దిగువపల్లె గ్రామ రైతులు తమ సాగులో ఉన్న భూములకు డి పట్టాలు మంజూరు చేయమని కోరగా సదరు రైతులు సాగులో ఉన్న భూములు మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉన్నందున గత 2012లో జరిగిన అసైన్‌మెంట్ కమిటీలో ఈ భూముల అర్హత పొందలేదని, కావున ఆ భూములకు పట్టాలు ఇవ్వలేమని తెలిపారు. అలాగే భూముల గురించి 6 అర్జీలు, కుల, ఆదాయ, ధ్రువపత్రం కొరకు 3 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. సర్పంచు రాధమ్మ, ఆర్ఐ శ్రీధర్, విఆర్‌ఓలు రఘు, అనూష, సర్వేయర్ ఉపేంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బాబ్జాన్‌కు సన్మానం



బాబ్‌జాన్‌ను సన్మానిస్తున్న బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి

**నంబులపూలకుంట, జనవరి 4 ప్రభాతవార్త**

పుట్టపర్తి పార్టీ ఆఫీస్‌లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్‌పికుంట మండల అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా బిజెపి బాబ్జాన్ ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సీనియర్ నాయకులు గురువరెడ్డి సన్మానంలో పాల్గొన్నారు.

## ఇసుక లారీ సీజ్ కేసు నమోదు

**ఓబుళదేవరచెరువు, జనవరి 4, ప్రభాతవార్త**

ఎలాంటి అనుమతులు లేకుండా అ క్రమంగా ఇసుకను కర్నాటకకు తరలిస్తున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ... శనివారం ఉదయం కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు. కదిరి వైపు నుండి గోరంట్ల వైపు వెళుతున్న లారీని తనిఖీ చేయగా ఇసుక బహిర్గతం అయిందన్నారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని అందులోని 18 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కడప జిల్లా గండిక్షేత్రం వద్ద గల చెరువులో ఇసుకను తీసుకుని డ్రైవర్ మధు లారీ యజమాని శ్రీనాథ్‌తో కలసి కర్నాటకలో అత్యధిక ధరలకు అమ్ముతున్నట్లు డ్రైవర్ తమ విచారణలో స్పష్టం చేసినట్లు ఎస్సై స్పష్టం చేశాడు.



సీజ్ చేసిన లారీ

## గతంలో చేసిన అసభ్య వ్యాఖ్యలపై చర్యల కోసం వినతిపత్రం

**రాప్తాడు, జనవరి 4 ప్రభాత వార్త**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పరిటాల కుటుంబం, కమ్యూనిస్టులను గతంలో రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో అసభ్య పదజాలంతో దూషించిన మాజీ శాసనసభ్యులు ప్రకాశ్ రెడ్డి సోదరుడు చందుపై కఠిన చర్యలు తీసుకోవాలని రాప్తాడు మండల నాయకులు డీఎస్పీ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ ఘటనకు సంబంధించి చందు వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.వినతిపత్రం సమర్పించిన నాయకులు మాట్లాడుతూ, "గతంలో జరిగిన ఈ సంఘటన ప్రజా ప్రతినిధుల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని" డిమాండ్ చేశారు. దీనిపై డీఎస్పీ గారు సత్వర దర్యాప్తు చేపట్టాలని వారు కోరారు.ఈ ఘటన రాప్తాడు ప్రాంతంలో రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారింది. మండల నాయకులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

## పేకాట రాయులు అరెస్ట్

**నల్లచెరువు, జనవరి 04 ప్రభాతవార్త:**

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న ఐపిఎస్ ఆదేశాలతో కదిరి సబ్ డివిజన్ డిఎస్పీ ఉత్తర్వుల మేరకు నల్లచెరువు పరిధిలోని బాలేపల్లితాండ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరం పై నల్లచెరువు మండల ఎస్సై మక్బూల్‌బాషా తన సిబ్బందితో అక్కడికి చేరుకొని పేకాట ఆడుతున్న వారిపై రైడింగ్ నిర్వహించి నలుగురిని పట్టుకొని అరెస్టు చేయడంతో పాటు రూ.2,800నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేశారు.

# మేజర్ మరమ్మతుల్లో.. గోరంట్ల లో మేజర్ పనులు

- మట్టితో గుంతలు పూడ్చిన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సంజయ్.

గోరంట్ల జనవరి 4 ప్రభాతవార్త


రోడ్డు మరమ్మతు పనుల్లో పంచాయతీ సిబ్బంది

గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధి లోని పట్టణంలోని ప్రధాన కూడళ్ళల్లో ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గోరంట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి మరమ్మతులకు శ్రీకారం చుడుతూ దాదాపు పట్టణంలో 20 ప్రాంతాల్లో 30 ట్రాక్టర్ల మట్టిని తొలి మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మరియు సంజయ్ ల చొరకవతో కార్యాలయ సిబ్బంది ప్రత్యేక ట్రాక్టర్లతో మట్టిని తీసుకొచ్చి పట్టణంలోని ప్రధాన రహదారి తో పాటు రాజమండ్రి పట్టణ వ్యాప్తంగా పలు కూడళ్ళు పలు వీధుల్లో సైతం మట్టిని తొలి గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టడంపై వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తూ పంచాయతీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# విద్యార్థిని ఆత్మహత్య.

రాయదుర్గం రూరల్, జనవరి 04 ప్రభాతవార్త:


మృతి చెందిన భారతి

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి సావిత్రమ్మల కుమార్తె భారతి(18)ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు భారతి కర్ణాటకలోని బళ్లారిలో ఉన్న ఎస్‌జిటి కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. చదువును అభ్యసించేందుకు అనాశక్తితో ఉండడంతో తల్లిదండ్రులు చదువుకోమని చెప్పడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టు ప్రక్కల స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి సావిత్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

# ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య.

రాయదుర్గం రూరల్, జనవరి 04 ప్రభాతవార్త:


ఆత్మహత్య చేసుకున్న అంబిక ఫైల్‌పోటో

కుటుంబంలోని చిన్నపాటి గొడవలతో ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం సాయంకాలం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాయదుర్గం పట్టణంలోని కోటలో ఉన్న మారెమ్మగుడి ఏరియాలో ఉన్న బేల్దారి పని చేస్తున్న శివ భార్య అంబిక(24)అనే వివాహిత శనివారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్ల తెలిపారు. భార్యభర్తల మధ్య చిన్నపాటి తగాదా చోటు చేసుకోవడంతో భర్త బయటికి వెళ్లిపోయాడని, అదే కోపంతో భార్య ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారన్నారు. రాయదుర్గం అర్బన్ సీఐ జయానాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని వివారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన తెదేపా నాయకులు

గుడిబండ జనవరి 4 ప్రభాతవార్త:


మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ రవిచంద్ర కుమార్, తెదేపా మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వ ం ం జు నా ద:ౕ, లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్,ఎంపిటిసి వనజాశశిధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం వల్ల గ్రామాలనుండి కళాశాలకు వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకుడు షబ్బీర్, క్లస్టర్ ఇంచార్జీలు లక్ష్మీనరసప్ప, భీమరాజు, శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

# తాడిమర్రి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

తాడిమర్రి, జనవరి 4 ప్రభాతవార్త


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో శనివారం ఈ పథకాన్ని తాడిమర్రిలో ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ పథకం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి సకాలంలో రావడానికి భోజన సౌకర్యం అడ్డంకిగా ఉండేదని, విద్యార్థుల అగచాట్లను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ముఖ్యమంత్రికి తెలియజేయడంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తాడిమర్రి మాజీ సర్పంచు ఆదినారాయణ, స్థల దాత, సుప్రమ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేరిమాకులపల్లి వెంకటేష్, నాగభూషణం, జిల్లా టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు తెలుగుదేశం పార్టీ నాయకులు ముంటిమడుగు హర్ష ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల సమక్షంలో ప్రారంభించి మంత్రి సత్యకుమార్, నారాలోకేష్ ప్రసంగాన్ని టివి ద్వారా విద్యార్థులకు వినిపించారు. అనంతరం విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు భాస్కర్‌రెడ్డి, ఎండిఓ రంగనాథ్, ఎంఈఓ కృష్ణమోహన్, కళాశాల ఉపాధ్యాయులు, లెక్చరర్లు, నిడిగల్లు సర్పంచు భూషణ్, పకీరారెడ్డి తాడిమర్రి సర్పంచు బాలమ్మ, హైస్కూల్ కమిటీ చైర్మన్, పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిడిగల్లు తాడిమర్రి, శివంపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి, తాడిమర్రి భాస్కర్‌గౌడ్, వాసవి పాఠశాల చైర్మన్ ముంటిమడుగు వినోద్, పలువురు పాల్గొన్నారు.

# సమన్వయంతో భద్రత ప్రమాణాలు పెంచాలి -జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్


విమానశ్రయం భద్రతపైసమీక్షా సమావేశం దృశ్యం

శ్రీసత్యసాయిజిల్లా, జనవరి 4, ప్రభాతవార్త ప్రతినిధి:

అధికారులందరూ సమన్వయంతో సత్యసాయి విమానాశ్రయంలో భద్రత ప్రమాణాలు పెంచాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం విమానాశ్రయంలో ఎయిర్పోర్టు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ విమానాశ్రయంలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఏఏ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఇందుకు ప్రభుత్వ అధికారులు, విమానాశ్రయం నిర్వాహకుల మధ్య పరస్పర సహకారం ఉండాలని సమాచార బదిలీతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం విమానా విమానాశ్రయం సిబ్బంది ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డైరెక్టర్ వీరరాఘవ గ్రూప్ కమాండ్, విమానాశ్రయం డైరెక్టర్ సాయినాథరెడ్డి, ఆడ్మిన్ లక్ష్మినారాయణ, ఆర్టీఓ సువర్ణ, డీఎస్పీలు , విజయకుమార్, ఎమ్మార్వో అనుపమ, మున్సిపాలిటీ కమిషనర్ ప్రహల్లాద, పి.సుధాకర్, చంద్రనాయక్, బిఎస్ఎన్ఎల్ ప్రతినిధి నవీన్ కుమార్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ ఎస్ఎండి సాదిక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కెటిహల్లి గ్రామ పంచాయితీ మాజీ ఉపాధ్యక్షుడు హత్య

పావగడ, జనవరి 4 ప్రభాతవార్త


హత్యకు గురైన గ్రామ పంచాయితీ మాజీ ఉపాధ్యక్షుడు నరసింహప్ప

పావగడ తాలూకాలోని అరసికెర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కెటి హళ్లి గ్రామ పంచాయితీ మాజీ ఉపాధ్యక్షులు నరసింహప్ప శుక్రవారం మధ్యాహ్నం హత్యకు గురైనట్లు అరసికెర పోలీసులు తెలిపారు. వివరాల మేరకు దేవలకెరే గ్రామానికి చెందిన నరసింహప్ప శుక్రవారం తన 30 మేకలను మేత కోసం తిప్పన కొండకు తీసుకొని వెళ్లాడని ఆ సమయంలో కరియమ్మనపాళ్య గ్రామానికి చెందిన మణికంఠ అనే వ్యక్తి నరసింహప్పను కొడవలితో చేతివేళ్లను నకత్తిరించి గొంతుకోసి హత్య చేసినట్లు తెలిపారు. అనంతరం 30 మేకలను తోలుకొని వెళ్లి శనివారం చిత్రదుర్గం జిల్లా హిరియూరు గొర్రెల సంతలో మేకలను అమ్ముతుండగా మృత నరసింహప్ప కుమారుడు మంజునాథ్ విషయం తెలుసుకొని వెళ్లి మేకలను గుర్తించి పట్టుకొని పోలీసులకు విషయం తెలుపగా అరసికెర పోలీసులు వెళ్లి మణికంఠను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని కుటుంబానికి మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్, పావగడ మున్సిపల్ చైర్మన్‌రాజేష్, పాలేగార్ లోకేష్, తదితరులు సంతాపాన్ని వ్యక్తపరిచారు.

# కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల టివి, ఫ్రిజ్ బూడిద

- ఐదు బియ్యం బస్తాలు, దుస్తులు దగ్ధం - 1.50 లక్షల ఆస్తి నష్టం


బెలుగుప్ప, జనవరి 4 ప్రభాతవార్త


బూడిదైన బియ్యం బస్తాలు, దుస్తులు, ఫ్రిజ్, టివి తదితరాలు

బెలుగుప్ప మండల పరిధిలో అంకంపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం టివి షార్ట్ సర్క్యూట్ కావడంతో టివితోపాటు ఫ్రిజ్, ఇంటిలోని ఐదు బస్తాల బియ్యం, దుస్తులు పూర్తిగా కాలిపోవడం జరిగింది. వెంటనే ఇంటిలోని వారు గమనించి బయటికి రావడంతో ప్రాణాపాయం జరగలేదు. ఈ సంఘటన వల్ల 1.50 లక్షల ఆస్తి నష్టం జరిందని కుటుంబ యజమాని తెలిపారు. మాకు ప్రభుత్వం సాయం అందించాలని వారు వేడుకున్నారు.

# వైఎస్ఆర్‌టిఎ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ,డిఇఓ

పుట్టపర్తి (కలెక్టరేట్), జనవరి 04, ప్రభాతవార్త


వైఎస్ఆర్‌టిఎ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైఎస్ఆర్‌టిఎ డైరీ, క్యాలెండర్లను ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి, డీఈఓ కృష్ణయ్యలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో వైఎస్ఆర్‌టిఎ కృషిని ప్రశంసించారు. ఉపాధ్యాయులు ఎవరైనా సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే తమవంతు పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో వైఎస్ఆర్‌టిఎ కృషి అభినందనీయమన్నారు. వైఎస్ఆర్‌టీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, ఇంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎవరైనా సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే తమవంతు పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా వైఎస్ఆర్‌టిఎ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు రమణా రెడ్డి, ఇంద్రప్రసాద్, జంషీద్, గంగధర్ రెడ్డి, శివయ్య, రవీంద్ర రెడ్డి, జమీర్, అలీ, సునీత, సుజాత, జయరామి రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కేశవరెడ్డి, కేశప్ప, సత్యనారాయణ రెడ్డి, రాజేష్, శ్రీనివాసరెడ్డి, ధనుంజయ రాజు, వెంకటరామిరెడ్డి, రజిత, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య సంరక్షణ విద్యపై అవగాహన

పుట్టపర్తి, జనవరి 4, ప్రభాతవార్త

మండల పరిధిలోని దండువారిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ నందుబాల్య సంరక్షణ విద్యపై అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పూర్వ ప్రాథమిక,1,2 దశలలో పిల్లల సంరక్షణ, విద్యపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేస్తూ, పిల్లలు నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులకు తెలిసేలా పిల్లలతో అభినయం చేయించి ప్రీస్కూల్ పిల్లలకు, తల్లిదండ్రులకు చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు వేదవతి, యశోద, వైద్య సిబ్బందిలతోపాటు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్ పిటిపిబాల్య సంరక్షణ విద్య కార్యక్రమంలో అంగనవాడిలు, వైద్యసిబ్బంది పిల్లల తల్లిదండ్రులు.

# ఆచలి డెంటల్ వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె


డెంటల్ వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె

అనంతపురం, జనవరి 4 ప్రభాతవార్త బ్యూరో

ప్రతి ఒక్కరూ నోటి దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రజలకు సూచించారు. అనంతపురం విద్యుత్ నగర్ సమీపంలో ఆచలి నూతన డెంటల్ వైద్యశాలను శనివారం పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిల చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆచలి డెంటల్ వైద్యశాల నిర్వాహకురాలు డాక్టర్ జీవి భ్రమర, డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, జి.సుధాకర్, జి.వసంతలక్ష్మి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు సేఫ్టీ నియామకాలు పాటించి సురక్షితంగా గమ్యాలు చేరుకోండి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ తదితరులు

అనంతపురం, జనవరి 4 ప్రభాతవార్త బ్యూరో

జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టి రోడ్డు సేఫ్టీపై అవగాహన చేశారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ల డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్‌డ్రైవింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. అదే విధంగా..సైబర్ మోసాలు, గంజాయి, అనర్థాలపై ప్రజలకు తెలియజేశారు.

# దొంగతనం కేసును త్వరలోనే ఛేదిస్తాం


డాగ్‌స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శింగనమల, జనవరి 4 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని దుర్గాంజినేయస్వామి కొండపై వెలిసిన ఆంజినేయస్వామి దేవాలయంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన దొంగతనం కేసును త్వరలోనే ఛేదిస్తామని సిఐ కౌలుట్లయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి దుండగులు దుర్గాంజినేయ స్వామి ఆలయంలో కెజి వెండి నగలు, ఆంజినేయస్వామి దేవాలయంలో 3 కెజిల వెండి నగలను అపహరించినట్లు తెలిపారు. స్వాముల వారి వెండి నగలతోపాటు అమ్మవారి ఇత్తడి ఉత్సవ విగ్రహాన్ని అపహరించినట్లు తెలిపారు. దొంగతనం సంఘటనను సిఐ కౌలుట్లయ్య,ఎస్ఐ విజయ్‌కుమార్‌లు పరిశీలించి జిల్లా కేంద్రం నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూజ్ టీంలను రప్పించి వివరాలను సేకరించినట్లు తెలిపారు. రూరల్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకుని ప్రత్యేక దర్యాప్తుచేస్తున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సిఐ కౌలుట్లయ్య తెలిపారు.

# అధిక వడ్డీ పేరుతో తమను మోసం చేశారు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చిలకమ్మ, గుండెమ్మలు

అనంతపురం కల్చరల్, జనవరి 4 ప్రభాతవార్త

శోభారాణి అధిక వడ్డీ అని ఆశచూపి తనను నిలువునా మోసంచేసిందని బుక్కరాయసముద్రంకు చెందిన చిలకమ్మ, గుండెమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిలకమ్మ, గుండెమ్మలు మాట్లాడుతూ.. బుక్కరాయసముద్రంకు చెందిన యానిమేటర్ శోభరాణి తనను భారీ స్థాయిలో మోసం చేసిందని, ఆ కారణంగానే తాను ఆత్మహత్యాతమ్నం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. శోభారాణి డబ్బు అంశానికి తన అన్న చేపల రమణకు ఎలాంటి సంబంధం లేదనిచిలకమ్మ తెలిపారు. తన అన్న చేపల రమణను అనవసరంగా లాగుతూన్నరని స్పష్టం చేశారు.

# ప్రజా సంఘాల పేరుతో భూములు కబ్జా


మాట్లాడుతున్న నాయకులు మోహన్

అనంతపురం అర్బన్, జనవరి 4 ప్రభాతవార్త

ప్రజా సంఘాల పేరుతో పేదప్రజల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు మోహన్ ఆరోపించారు. శనివారం నగరంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపినాయకులు మోహన్ మాట్లాడుతూ.. వడ్డే హరి, తేజ, మౌనిక అనే వ్యక్తులు ప్రజా సంఘాల పేరుతో భూ కబ్జాలు చేస్తూ, ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయిస్తామని బెదిరించి, తమను వేదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1986లో అనంతపురంరూరల్ మండలం రాజీవ్‌కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 58/6, 60 చెందిన భూమిని ప్రభుత్వం అప్పట్లో పేదలకు పట్టాల రూపంలో పంపిణీ చేసిందని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు, వన్ బి అడంగల్, ప్రభుత్వ పట్టాలు ఇలా అన్ని పత్రాలు ఉన్నప్పటికీ పేద ప్రజల భూమిని బెదిరింపుల ద్వారా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మహిళలను ఉసిగొలిపి భూమి యాజమానుల పైన దాడులు చేయించారని వాపోయారు. ఈ కార్యక్రమంలో భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.. బాగా చదవండి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ
- జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జనవరి 4 ప్రభాతవార్త

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాము భాగా చదివిఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలో జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రారంభించారు. ఈ


విద్యార్థులకు భోజనం వండిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధా య్హ్న భోజనం ప్రారంభించిందని


ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి భోజనం తినిపిస్తున్న విద్యార్థిని

పేర్కొన్నారు. సుదూరప్రాంతాల నుంచి ఇంటర్ విద్యాభ్యాసం కొరకు వచ్చే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటమే కాకుండా విద్యార్తుల తల్లిదండ్రులు పనులకు వెళ్లడం వల్ల సకాలంలో వారికి క్యారేజీ కట్టలేక పోతూ ఇబ్బంది పడుతున్న దృష్ట్యా మధ్యాహ్న భోజనం బయట చేస్తే అదనంగా డబ్బు ఖర్చు అవుతుందని కొందరు విద్యార్థులు పస్తులుంటున్నారని, ఆకలితో చదువుపై దృష్టి పెట్టలేక పోతున్నారని, ఇటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇంటర్మిడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఇంటర్ కళాశాలలో మధ్యాహ ్న భోజన పథకాన్ని పునరుద్దరించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ఉత్తీర్ణత శాతం పెరుగుదులకు పౌష్టికాహారం లోపం లేకుండా చక్కటి ఆహారాన్ని విద్యార్థులకు అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ప్రత్యేక చొరవచూపారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో అమలు చేసిన మధ్యాహ్న భోజనం పథకాన్ని జగన్ సర్కార్ పక్కన పెడితే కూటమి ప్రభుత్వం తిరిగి అమలు చేయడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఎంతో మంది ఆకలి తీర్చి చరిత్రలో నిలిచిపోయిన డొక్కా సీతమ్మ పేరును ఈ మధ్యాహ్న భోజన పథకానికి పెట్టాలని సూచించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, పథకాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శాలిని, తరిమెల ఆయకట్టు చైర్మన్ చెండ్రాయుడు, తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎంపిడిఓ నిర్మలాకుమారి, కాలేజీ భోజన సిబ్బంది ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పెద్దల తీరు...నాయకుల బేజారు..!!

- నియోజకవర్గం భాజపాలో పెరుగుతున్న పెద్దల పెత్తనం
- ఇతరులను ఎదగనీయడం లేదని ఆరోపణలు

గుంతకల్లు, జనవరి 4 ప్రభాతవార్త

భారతీయ జనతాపార్టీ (బిజెపి)లో కొందరు పెద్దల తీరుతో పలువురు నాయకులు, యువత బేజారు చెందుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గం భాజపాలో పెద్దల పెత్తనం పెరుగుతుండడమే అందుకు కారణమని సమాచారం. కొత్త తరానికి అవకాశాలు ఇవ్వకుండా క్రియాశీలక పదవుల్లో వారే కొనసాగుతూ తమకు నచ్చిన వారికి పదవులు వచ్చేలా చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వున్నాయి. నిబద్ధతతో పనిచేసే వారికి బాధ్యతలు అప్పగించి పార్టీ బలోపేతానికి తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వారే ఇలా వ్యవహరిస్తుండడం బాధాకరమని పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిణామాలు పార్టీలో చోటు చేసుకుంటుండడం దురదృష్టకరమని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రధాని నరేంద్రమోడి సంస్కరణలు నచ్చి పార్టీలో కొనసాగాల్సి వస్తుందని వాపోతున్నారు. దేశవ్యాప్తంగా బలమైన నాయకత్వం వున్న బిజెపి లాంటి జాతీయ పార్టీని నియోజకవర్గం లో ఎందుకు బలోపేతం చేయలేకపోతున్నారంటూ బిజెపి వాదులు ప్రశ్నిస్తున్నారు. జయంతి, వర్ధంతులకు మాత్రమే కార్యక్రమాలు చేస్తూ మీడియాలో కనబడుతున్నారంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం కూటమిలో భాగంగా అధికారంలో వున్నారు కానీ అధికారంలో లేని సందర్భాల్లో ప్రజా సమస్యలపై నాయకులు గళమెత్తిన సందర్భాలు చాలా తక్కువేనని చెప్పాలి. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సీనియర్ నాయకులు పసుపుల హరిహరనాథ్ పోటీ చేయగా 1570 ఓట్లు వచ్చాయి. 2014 ఎన్నికల్లో అప్పటి సిఐ వెంకటరామయ్య బిజెపి తరుపున బరిలోకి దిగితే 3865 ఓట్లు పడ్డాయి. అలాగే 2019 ఎన్నికల్లో అధినాయకత్వం హరిహరనాథ్ వైపే మొగ్గు చూపి తిరిగి ఎన్నికల బరిలో నిలిపితే కేవలం 1163 ఓట్లు మాత్రమే బిజెపికి దక్కాయి. ఇదిలా వుండగా 1999 స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలో భాగంగా బిజెపి నుండి హరిహరనాథ్, గుర్రం సూర్యనారాయణ కౌన్సిలర్లుగా గెలుపొందారు. అలాగే 2006లో ప్రస్తుత ఆర్యవైశ్య సంఘం నాయకులుగా కొనసాగుతున్న గోపా జగదీష్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఈ విజయాలు మినహా పార్టీకి చెప్పుకోదగ్గ విజయాలు అందించలేకపోయారు. మొన్న జరిగిన పలు కమిటీల్లో కూడా కనీస సభ్యత్వాలు చేయని తమకు అనుకూలమైన వ్యక్తిని ఓ పదవికి సీనియర్లు ప్రపోజల్ చేసినట్లు వినికిడి. పార్టీ పేరు చెప్పుకొని పనులు జరుపుకుంటున్నారు తప్ప పార్టీకి వారు చేసింది లేదని పలువురు బిజెపి అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీనియర్‌లుగా చాలామని అవుతున్న కొందరు నాయకులు పెత్తనానికి తగ్గట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరుతున్నారు. అధినాయకత్వంనియోజకవర్గం వైపు దృష్టి సారించి పార్టీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని బిజెపి నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

05-01pg10exHMNWJQE.qxd:05-01pg10exHMNWJQE.qxd 05/01/25 10:16 PM Page 1





# నేషనల్ అవార్డ్స్: నిర్లక్ష్యంలో క్రికెట్

## విమర్శల్లో క్రీడా పురస్కారాలు

### అద్భుత ప్రదర్శన చేసినా పట్టని కేంద్రం

**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ క్రీడా పురస్కారాల ఎంపిక విషయమై ఈ సారి తీవ్ర విమర్శలకు దారితీసింది. నేషనల్ అవార్డ్స్‌లో క్రికెట్‌ను పట్టించుకోకపోవడంతో ప్రతిభ కలిగిన ప్లేయర్లకు మొండి చేయి మిగిలింది. అర్జున అవార్డుల జాబితాలో 32 మంది ఆటగాళ్లకు స్థానం కల్పించినప్పటికీ, క్రికెటర్లను పూర్తిగా విస్మరించారు. ఇది కేవలం క్రికెట్ అభిమానులను మాత్రమే కాదు, క్రికెట్ సంఘాలకూ నిరాశనుకలిగించింది. బీసీసీఐ క్రీడా పురస్కారాలకు క్రికెటర్ల పేర్లను సిఫారసు చేయకపోవడం వెనుక ఉన్న కారణాలపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా వంటి దిగ్గజ క్రికెటర్‌ను, టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించిన హెడ్‌కోచ్ ద్రవిడ్‌ను అవార్డుల జాబితాలో చేర్చకపోవడం చర్చనీయాంశమైంది. బుమ్రా 2024లో అద్భుత ప్రదర్శన కనబరిచినా, ఖేల్‌రత్నకు ఎంపిక కాలేదు. రాహుల్ ద్రవిడ్ టీమిండియాను 2024 టీ20 ప్రపంచకప్‌లో జైత్రయాత్ర దిశగా నడిపించినప్పటికీ, ద్రోణాచార్య అవార్డుకు ఎంపికవ్వలేదు. టీమిండియా సుదీర్ఘ కాలం తర్వాత టీ20 ప్రపంచకప్ విజయం సాధించినప్పటికీ, ఈ విజయానికి మార్గదర్శకత్వం వహించిన క్రికెటర్లు, కోచ్‌లు అవార్డులలో చోటు దక్కించుకోకపోవడం అభిమానులను నిరాశకు గురిచేసింది. 17 ఏళ్ల తర్వాత టీమిండియా ప్రపంచకప్‌గెలవడంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా, టెస్ట్, టీ20 ఫార్మాట్లలో అద్భుత ప్రదర్శ నతో అలరించాడు. 2024లో టెస్టుల్లో 71 వికెట్లు, టీ20 ప్రపంచకప్‌లో 15 వికెట్లు పడగొట్టిన అతని ప్రదర్శన అంతా మేటి. అయినప్పటికీ, అతని పేరు ఖేల్ రత్న పురస్కార జాబితాలో లేకపోవడం అభిమానుల నిరసనకు దారితీసింది. అదే విధంగా, టీమిండియా విజయం వెనుక సారథ్యం వహించిన రాహుల్ ద్రవిడ్‌కు ద్రోణాచార్య అవార్డ్ ఇవ్వాలని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రాహుల్ ద్రవిడ్ మార్గదర్శకత్వంలో టీమిండియా బలమైన జట్టుగా తిరిగి పునరుద్ధరించబడింది. కానీ ప్రభుత్వ నిర్ణయంపై క్రీడా అభిమానులు ప్రశ్నిస్తున్నారు.



# టెన్నిస్‌లో.. సహజ సంచలన విజయం

**ఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ 75 టోర్నమెంట్లో తెలంగాణ క్రీడాకారిణి యామలపల్లి సహజ మరో సంచలన విజయం సాధించింది. థాయ్లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో జరిగిన ఈ టోర్నీలో భాగంగా మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 284వ ర్యాంకర్ సహజ 6–3, 5–7, 6–3తో ప్రపంచ 190వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ అమెరికాకు చెందిన మరియా మాటీస్ పైగెలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. 2 గంటల 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్ను ఐదుసార్లు కోల్పోయిన సహజ ప్రత్యర్థి సర్వీసును ఏడుసార్లు బ్రేక్ చేసింది. అంతకు ముందు జరిగిన క్వార్టర్ ఫైనల్లో సహజ మూడో సీడ్, 214వ ర్యాంకర్ చైనాకు చెందిన హీన్ షిను బోల్తా కొట్టించింది.

# ప్రపంచ ఖోఖో ట్రోఫీల ఆవిష్కరణ

## 24 దేశాల నుండి 615 మంది హాజరు

### 13 నుండి మ్యాచ్‌లు ప్రారంభం

**ఢిల్లీ:** ప్రప్రథమ ఖో ఖో ప్రపంచ కప్ విజేతలుగా నిలిచే పురుషులు, మహిళాజట్లకు అందజేసే ట్రోఫీలనులాంఛనంగా ఆవిష్కరించారు. పురుషుల విభాగంలో నీలిరంగు ట్రోఫీని బహూకరించనుండగా, మహిళలకు ఆకుపచ్చ రంగు ట్రోఫీని ప్రదానం చేస్తారు. ఈ మెగా ఈవెంట్లో కనువిందు చేసే మస్కట్లకు తార, తేజస్ అని పేర్లు పెట్టారు. భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత



ఖో ఖో సమాఖ్య (కేకేఎఫ్ఐ) అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ ట్రోఫీ లను ఆవిష్కరించి, మస్కట్లను మీడియాకు పరిచయం చేశారు. కాగా పురుషులు, మహిళల విభాగాల్లో భారత్ నుంచి రెండేసి జట్లు చొప్పున బరిలోకి దిగనున్నాయి. భారత్ ఎ, భారత్ బి నాలుగు జట్లను ఈ నెల 8న ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం ఇరు విభాగాల్లో 60 మందిప్లేయర్ల చొప్పున జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ తొలి ఖో ఖో ప్రపంచ కప్‌లో 24 దేశాలకు చెందిన జట్లు పాల్గొంటాయి. ఇండోనేసియా కేవలం మహిళల జట్టునే పంపిస్తుండగా మిగతా 23 దేశాలు ఇరు జట్లను పంపనున్నాయి. ఈ ఖో ఖో పోటీల్లో మొత్తం 615 మంది క్రీడాకారులు,125 మంది సహాయ సిబ్బంది పాల్గొనున్నారు. అయితే పాకిస్తాన్ జట్లకు ఇంకా వీసాలు మంజూరు కాలేదు. త్వరలోనే ఇది కొలిక్కి వస్తుందని నిర్వాహకులు ప్రకటించారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీవరకు లీగ్ దశ పోటీలు జరుగుతాయి. తొలి మ్యాచ్‌లో భారత్, పాక్ జట్లు పోటీపడతాయి. 17 నుంచి నాకౌట్ దశ మొదలవుతుంది. ఆ రోజు క్వార్టర్ ఫైనల్స్, 18న సెమీస్, 19న జరిగే ఇరు విభాగాల ఫైనల్స్తో ప్రపంచ కప్ టోర్నీ ముగుస్తుంది.



# మినీ వరల్డ్ కప్ ఫీవర్

## ఇక ఛాంపియన్స్ ట్రోఫీపై దృష్టి

## టీమిండియాలో ప్లేస్ ఎవరికో?

### ఫిబ్రవరి 23న పాక్‌తో హై ఓల్టేజ్ మ్యాచ్

**ఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి సమయం ముంచుకొస్తోంది. ప్రస్తుతం బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్‌లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య చివరి మ్యాచ్ జరుగుతోంది. అయితే ఇప్పుడు అందరి దృష్టి ఛాంపియన్స్ ట్రోఫీపై పడింది. మినీ వరల్డక్ కప్‌గా భావించే ఈ టోర్నీలో ఆడనున్న భారతీయ ఆటగాళ్ల ప్లేస్‌పై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ టోర్నీ లో భారత్ తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. ఫిబ్రవరి 19 నుంచి ఈ పోటీలు ప్రారంభం కానుండగా, మొత్తం ఎనిమిది జట్లు కప్ కోసం పోటీపడుతున్నాయి. భారత్ గ్రూప్‌లో న్యూజిలాండ్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో భారత్ తొలి మ్యాచ్ ఆడనుంది. దీని తర్వాత ఫిబ్రవరి 23న హై ఓల్టేజ్ ఇండియా పాకిస్థాన్ మ్యాచ్, ఆ తర్వాత మార్చి 2న న్యూజిలాండ్‌తో చివరి లీగ్ మ్యాచ్ జరగనుంది. అయితే ఈ టోర్నీలో భారత జట్టులో ఎవరెవరు ఉంటారన్న దానిపై కసరత్తు జరుగుతోంది. కెప్టెన్ రోహిత్ శర్మ ఉంటాడా లేదా అనేది సందిగ్ధమవుతోంది. ఎందుకంటే టీ20 ప్రపంచకప్ తర్వాత రోహిత్ శర్మ కెప్టెన్సీ ఖరారైంది. ఛాంపియన్స్ ట్రోఫీ,ప్రపంచటెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌ను అతని నేతృత్వంలోనే ఆడనున్నట్లు ప్రకటించారు. రోహిత్ తో పాటు విరాట్ కోహ్లి, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా జట్టులో ఉండటం దాదాపు ఖాయం. అయితే ఈ టోర్నీ కోసం ఒకరి పేరు బాగా వినిపిస్తోంది సాగుతోంది. అతనే శ్రేయాస్ అయ్యర్. గత కొన్ని రోజులుగా ఈ ఆటగాడు టీమిండియాలో లేడు. భారత జట్టులో రీ ఎంట్రీ ఇచ్చేందుకు శ్రేయస్ దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. వచ్చిన అవకాశాలన్నింటినీ సద్వినియోగం చేసుకుంటూ భారీగా పరుగులు సాధిస్తున్నాడు. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీలోనూ సెంచరీ తో మెరిశాడు. కాగ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా ఇంగ్లండ్‌తో టీ20, వన్డే సిరీస్‌లు ఆడనుంది. ఒకవేళ ఈ సిరీస్‌లో శ్రేయస్ ఎంపికైతే ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఆడుతాడనడంలో ఎలాంటి సందేహం లేదు. విజయ్ హజారే ట్రోఫీలో పుదుచ్చేరిపై శ్రేయాస్ అయ్యర్ 133 బంతుల్లో 137 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. ఇందులో 16 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. స్పోర్ట్‌స్టాక్ నివేదిక ప్రకారం, ।దిది ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం జట్టును ప్రకటించడానికి చివరి తేదీ జనవరి 12. అయితే బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఒకరోజు ముందుగా అంటే జనవరి 11న భారత జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరుగుతోంది. గత 2017 ఎడిషన్‌లో ఫైనల్‌లో భారత్‌పై పాకిస్తాన్ విజయం సాధించింది.

## గవాస్కర్ ట్రోఫీ: రెండో ఇన్నింగ్స్‌లో

# 141 రన్స్‌తో భారత్

### ఆస్ట్రేలియాపై 145 పరుగుల ఆధిక్యం

**ఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి టెస్టు రెండో రోజు భారత్ 145 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. జడేజా 8 పరుగులు, సుందర్ 6 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. రెండో రోజు మొత్తం 15 వికెట్లు పడ్డాయి. ఆస్ట్రేలియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 181 రన్స్‌కు ఆలౌటైంది. దీంట్లో శనివరాం ఆ జట్టు 9 వికెట్లను కోల్పోయింది. ఉదయం భారత బౌలర్లు మెరుగ్గా బౌలింగ్ చేశారు. బుమ్రా 10 ఓవర్లలో 2 వికెట్లు తీసుకుని, లంచ్ తర్వాత గాయం వల్ల ఆటకు దూరంగా ఉన్నాడు. అయితే ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్, నితీశ్ రెడ్డి తమ బౌలింగ్ బాధ్యతలను నిర్వర్తించారు. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో వెబ్‌స్టర్ అత్యధికంగా 57 రన్స్ చేశాడు. తొలి టెస్టు ఆడుతున్న అతను తన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. స్టీవ్ స్మిత్ 33 పరుగుల చేసి ఔటయ్యాడు. అయితే మరో అయిదు పరుగులు జోడిస్తే, అతను పది వేల పరుగుల మైలురాయిని చేరుకుంటాడు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆరంభంలో జైస్వాల్ మంచి స్టార్ట్ ఇచ్చాడు. ఫస్ట్ ఓవర్‌లోనే అతను స్టార్క్ బౌలింగ్‌లో నాలుగు బౌండరీలు కొట్టాడు. కానీ ఆ తర్వాత ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలవలేకపోయాడు. టాప్ ఆర్డర్‌లో జైస్వాల్ (22), గిల్ (13), రాహుల్ (13), కోహ్లి (6) మళ్లీ విఫలమయ్యారు. అయితే రిషబ్ పంత్ వేగంగా హాఫ్ సెంచరీ స్కోర్ చేశాడు. 29 బంతుల్లోనే అతను హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. దాంట్లో ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. టెస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా పంత్ హాఫ్ సెంచరీ చేయడం ఇది రెండోసారి. గతంలో కేవలం 28 బంతుల్లోనే శ్రీలంకపై అర్ధశతకాన్ని నమోదు చేశాడు. కానీ 61 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతను క్యాచ్ అవుట్ అయ్యాడు. ఆసీస్ స్పీడ్ బౌలర్ బోలాండ్ ఇప్పటికే 13 ఓవర్లలో నాలుగు వికెట్లు తీసుకున్నాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి జడేజా, సుందర్ క్రీజ్‌లో ఉన్నారు.





# ఇకపై ఎక్కడి నుంచైనా పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ, జనవరి 4:** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) పెన్షనర్లకు శుభవార్త. ఇప్పుడు వారు ఏ బ్యాంకు నుంచైనా పెన్షన్ తీసుకోవచ్చు. ఇపిఎఫ్ఒ దేశవ్యాప్తం గా ఉన్న అన్ని ప్రాంతీయ కార్యాలయాల్లో కేంద్రీకృత పెన్షన్ చెల్లింపు వ్యవస్థ అమలును పూర్తి చేసింది. ఈ మేరకు కార్మిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. డిసెంబరు, 2024 నాటికి ఇపిఎఫ్ఒ మొత్తం 122 పెన్షన్ పంపిణీ ప్రాంతీయ కార్యాలయాలకు చెందిన 68 లక్షల మందికి పైగా పెన్షనర్లకు సుమారు రూ.1,570 కోట్ల పెన్షన్ పంపిణీ చేసినట్లు కేంద్రం తెలిపింది. ఈ మార్పు తర్వాత దేశంలోని ఏ బ్యాంకు నుంచి అయినా ఏ శాఖ నుంచి అయినా పెన్షనర్లు తమ పెన్షన్‌ను విత్‌డ్రా చేసుకోవ చ్చని కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవియా తెలిపారు. ఇప్పుడు ఈపీఎఫ్‌వో కార్యాలయం నుండి తమ పెన్షన్‌ను ఉపసంహరించు కోవచ్చు. దేశంలోని మొత్తం 122 ప్రాంతీయ ఈపీఎఫ్‌వో కార్యాలయాల్లో ఈ కేంద్రీకృత పెన్షన్ చెల్లింపు వ్యవస్థ అమలు చేసింది. పెన్షన్ వ్యవస్థ జనవరి 2025 నుండి పెన్షనర్ ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి మారినప్పుడు లేదా అతని బ్యాంక్ లేదా బ్రాంచ్‌ను మార్చినప్పుడు కూడా పెన్షన్ చెల్లింపు ఆర్డర్‌లను (పిపిఒ) ఒక కార్యాలయం నుండి మరొక కార్యాలయానికి బదిలీ చేయవలసిన అవసరం లేకుండా భారత దేశంఅంతటా పెన్షన్ పొంద వచ్చు. పదవీ విరమణ తర్వాత స్వగ్రా మానికి వెళ్లే పెన్షన్ దారులకు ఇది ఎంతో ఊరటనిస్తుంది. కేంద్ర పెన్షన్ చెల్లింపు వ్యవస్థ మొదటి పైలట్ ప్రాజెక్టు గత ఏడాది అక్టోబర్‌లో కర్నాల్, జమ్మూ-శ్రీనగర్ ప్రాంతీయ కార్యాలయాలలో 49,000 మందికి పైగా ఈపీఎస్ పెన్షనర్లకు సుమారు 11కోట్ల రూపాయల పెన్షన్ పంపిణీ చేసినట్లు మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపిం ది. రెండో ప్రయోగాన్ని నవంబర్‌లో 24ప్రాంతీయ కార్యాలయాల్లో చేపట్టగా, 9.3 లక్షలమందికిపైగా పింఛనుదారులకు రూ.213 కోట్ల పెన్షన్‌ను పంపిణీ చేసినట్లు పేర్కొంది.

# ఆడి సేల్స్ సూపర్ రికార్డు

**ముంబై, జనవరి 4:** ఆడి ఇండియా 2024 మొదటి ఆరు నెలల్లో సరఫరా సంబంధిత సవాళ్లను ఎదుర్కొందని ఆడి ఇండియా ప్రతినిధులు చెబుతున్నారు. అయినప్పటికీ ఆడి ప్రొడెక్ట్స్‌కు ఉన్న డిమాండ్ దృష్ట్యా సంవత్సరంలోని ద్వితియార్థంలో మెరుగైన సరఫరాతో కీలక మైలురాయిని చేరుకున్నామని పేర్కొంటున్నారు. ముఖ్యంగా 2024 మూడో త్రైమాసికంతో పోలిస్తే ఆడి కార్ల వాల్యూమ్‌లు నాలుగో త్రైమాసికంలో 36 శాతం మెరుగుపడిందని వివరిస్తున్నారు. ముఖ్యంగా 2024వ సంవత్సరంలో 5816 కార్ల అమ్మకాలు చేసినట్లు స్పష్టం చేశారు. అలాగే 2025 సంవత్సరంలో అమ్మకాలతో భారతదేశంలో 100,000 కార్లు విక్రయించేలా పలు కీలక చర్యలను తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. ఆడికి సంబంధించి ప్రీఓన్డ్ కార్ల విభాగాన్ని ఆడి ఆమోదించడంతో మునుపటి సంవత్సరంతో పోలిస్తే కార్ల అమ్మకాలు 2024లో 32 శాతం వృద్ధిని సాధించారు. ఆడి బ్రాండ్ తన అతిపెద్ద లగ్జరీ యూజ్డ్ కార్ షోరూమ్‌ను ఈశాన్య ప్రాంతంలో గౌహతిలో, మంగళూరులో ప్రారంభించింది. భారతదేశంలో కీలక నగరాల్లో 26 షోరూమ్‌లతో, ప్రీఓన్డ్ లగ్జరీ కార్ల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఆడి మరింత విస్తరించాలని యోచిస్తోంది. ప్రత్యేక '100 డేస్ ఆఫ్ సెలబ్రేషన్' క్యాంపెయిన్‌తో భారతదేశంలో లక్ష కార్ల అమ్మకాలను సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తుంది. ప్రీమియం కస్టమర్లను ఆకట్టుకునే విధంగా ఆడి క్యూ8, ఆడి క్యూ7 కార్లతో లగ్జరీ ఎస్‌యూవీ మార్కెట్‌లో తమ బ్రాండ్ ప్రత్యేకతను తెలిపేలా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆడి ప్రతినిధులు చెబుతున్నారు. ఆడి ఇండియాకు సంబంధించిన ప్రస్తుత ఉత్పత్తి లైనప్‌లో ఆడి ఎ4, ఆడి ఎ6, ఆడి క్యూ3, ఆడి క్యూ3 స్పోర్ట్‌బ్యాక్, ఆడి క్యూ5, ఆడి క్యూ7, ఆడి క్యూ8, ఆడి ఎస్5 స్పోర్ట్‌బ్యాక్, ఆడి ఆర్ఎస్ క్యూ8, ఆడి క్యూ8 ఇట్రాన్, ఆడి క్యూ8 ఇట్రాన్ స్పోర్ట్‌బ్యాక్, ఆడి ఇట్రాన్ జీటీ, ఆడి ఆర్ఎస్ ఇట్రాన్ జీటీ వంటి కార్లు ఉన్నాయి.



# కొత్త యేడాదిలో తొలిసారి తగ్గిన పసిడి ధర

**న్యూఢిల్లీ, జనవరి 4:** కొత్త ఏడాది ప్రారంభం నుంచి వరుసగా పెరుగుతున్న బంగారం ధరలు (గోల్డ్ ధర) తొలిసారి జనవరి 4 తగ్గాయి. జనవరి 1 నుంచి 3 వరకు రూ.1,640 వరకూ పెరిగింది. దీనితో తులం బంగారం రేటు రూ.80వేలకు చేరువైంది. ఈ పసిడి ధరలు శనివారం దిగరావడంతో కొనుగోలుదారులకు ఊరట కలిగింది. బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, నగల మార్కెట్‌లతో సహా అనేక అంతర్జాతీయ వస్తువులపై ఆధారపడి ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో బంగారం 10 గ్రాముల ధరలు రూ.450 (22 క్యారెట్లు), రూ.490 (24 క్యారెట్లు) తగ్గాయి. దీంతో 22 క్యారెట్ల బంగా రం 10 గ్రాముల ధర రూ.72,150కు, 24 క్యారెట్ల పసిడి రేటు రూ.78,710 వద్దకు దిగి వచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.78,860 వద్ద.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.72,300 వద్ద ఉంది. చైన్నైలో బంగారం ధరల విషయానికి వస్తే.. ఇక్కడ 22 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాము లకు రూ.450 తగ్గింది. 72,150 వద్దకు, 24 క్యారెట్ల ధర రూ.490 క్షీణించి రూ.78,710 వద్దకు దిగివచ్చాయి, బెంగళూరు, ముంబై నగరాల్లోనూ ఇవే ధరలు ఉన్నాయి. వెండి ధరలు 2025 ఏడాదిలో వెండి ధరలు కూడా తొలిసారి తగ్గుదల నమోదు చేశాయి. కొత్త సంవత్సరం ప్రారంభం నిలకడగా ఉన్న వెండి ధరలు తర్వాత ఏకంగా రూ.2000 పెరిగింది. దీంతో నిరాశచెందిన కొనుగోలు దారులకు ఊరట కలిగింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబైలోని వెండి ధర కేజీకి రూ.1000 చొప్పున తగ్గి రూ.99,000 వద్దకు దిగివచ్చింది. ఇక ఢిల్లీలో కూడా రూ.1000 క్షీణించి రూ.91,500 వద్దకు తగ్గింది.








Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.